


సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

జగన్ ప్రభుత్వం రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసేలా తీసుకున్న నిర్ణయాలను కూటమి ప్రభుత్వం సవరిస్తూ వస్తోంది. సీఆర్‌డీఏ పరిధిని గత ప్రభుత్వం కుదించగా తాజాగా దానిని పూర్వస్థితికి తెచ్చారు. ఏపీసీఆర్‌డీఏ(ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిం ది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించి దీనికి ఆమోదముద్ర వేసింది. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆరు మండలాలు, 92 గ్రామాలు, బాపట్ల జిల్లాలోని ఐదు మండలాల్లోని 62 గ్రామాలు తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి వచ్చాయి. దీంతో సీఆర్‌డీఏ విస్తీర్ణం తిరిగి 8352.69 చదరపు కిలోమీటర్లకు చేరింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం బిల్లు పెట్టి రాజముద్ర వేయనుంది. ఈ నిర్ణయంపై సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాలు, పట్టణాల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

- పరిధిని పునరుద్ధరించిన ప్రభుత్వం
- 8,352.69 చదరపు కిలోమీటర్లకు చేరిన విస్తీర్ణం
- గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ మంత్రివర్గం తీర్మానం
- మంత్రివర్గం నిర్ణయంపై పల్నాడు, బాపట్ల జిల్లావాసుల హర్షం

బాపట్ల, నరసరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు గత టీడీపీ ప్రభుత్వం కృషి చేయగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం దానిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నింది. ఇందులో భాగంగా సీఆర్‌డీఏను తొలుత రద్దు చేసేందుకు ప్రయత్నించి అది వీలు కాకపోవడంతో పరిధిని కుదించింది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా.. రాజధాని రైతులు పోరాడినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అమరావతిని పట్టాలెక్కిస్తోంది. ఇందులో భాగంగా సీఆర్‌డీఏ పరిధిని పునరుద్ధరిస్తూ బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో సీఆర్‌డీఏ పరిధిపై అస్పష్టత నెలకొనగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి నిర్ణయం తీసుకుంది. 2014లో ఏదైతే ఏపీసీఆర్‌డీఏ చట్టాన్ని ఆమోదించారో దానినే పునరుద్ధరించేందుకు ఆమోదముద్ర వేసింది. దీంతో గుంటూరు జిల్లాలో తాడేపల్లి మండలం, అర్బన్ ఏరియా, మంగళగిరి మండలం అర్బన్ ఏరియా, తుళ్లూరు, దుగ్గిరాల, తెనాలి మండలం, అర్బన్, గుంటూరు మండలం, అర్బన్, చేబ్రోలు, మేడికొండూరు, పెదకాకాని, వట్టిచెరుకూరు, అమరావతి, కొల్లిపర, వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాలు సీఆర్‌డీఏలోకి వచ్చాయి. వీటితో పాటుగా భట్టిప్రోలు మండలంలోని శివనాగులపాలెం, భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు, పొన్నూరు మండలంలో మునిపల్లె, మామిళ్లపల్లి, కొండముడి, ఉప్పరపాలెం, చింతలపూడి, వెల్లలూరు, ఆరేమండ, దండమూడి, పచ్చలతాడిపర్రు, మన్నవ, దొప్పలపూడి, జడవల్లి, నిడుబ్రోలు, జూపూడి, బ్రాహ్మణకోడూరు, వడ్డిముక్కల గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని కొండపాడు, యనమదల,

(మిగతా 6వ పేజీలో..)

దశ, దిశలేని బావుడా

కేవలం ఓ నామినేటెడ్ పోస్టు సృష్టించడం కోసమే ఆదరాబాదరాగా గత వైసీపీ ప్రభుత్వం బావుడా ఏర్పాటు చేసిందనే విమర్శలున్నాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు, కాకుమాను మండలాలను కూడా బావుడా పరిధిలోకి తెచ్చింది. చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ఒంగోలు కేంద్రంగా ఉన్న ఉడా పరిధిలో ఉన్నాయి. దీంతో జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో మూడు అటు, మూడు ఇటు ఉన్నాయి. ఇక సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న వేమూరు నియోజకవర్గాన్ని తీసుకొచ్చి బావుడాలో అయితే విలీనం చేసింది తప్ప అభివృద్ధి విషయంలో ఓ దశ, దిశ చూపడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తమ ప్రాంతం సీఆర్‌డీఏలోకి వెళ్లగా అభివృద్ధిపై గంపెడాశలతో ఉండగా వారి ఆశలను కాలరాస్తు వైసీపీ ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందనేది అక్కడి ప్రజల అభిప్రాయం.

తగ్గిన పూడా పరిధి

పల్నాడు జిల్లాలోని ఆరు మండలాలు, సత్తెనపల్లి మున్సిపాల్టీని సీఆర్‌డీఏలో విలీనం చేస్తూ క్యాబినెట్‌లో తీర్మానంతో పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అథార్టీ(పూడా) పరిధిని తగ్గింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాలతో పూడాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 22 మండలాలకు పూడా పరిధిని కుదించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, యడ్లపాడు మండలాలను పూడా నుంచి తొలగించి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకున్నారు. దీంతో పూడా రూపురేఖలు మారిపోయాయి. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలు, గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకే పూడాకు పరిమితమైంది.



సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

అమరావతికి నిరంతరాయంగా వెలుగులు

- అండర్ గ్రౌండ్ కేబుల్.. నాణ్యమైన విద్యుత్ సరఫరా
- తాళ్లాయపాలెంలో 20 ఎకరాల్లో రూ.505 కోట్లతో నిర్మాణం
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ.. ఐదు నెలల్లో పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం
- నేడు 400/220 కే.వీ.సబ్ స్టేషన్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తుళ్లూరు, గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నిరంతరాయంగా.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా 400/220 కేవీ సబ్ స్టేషన్ అందుబాటులోకి వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో 20 ఎకరాల్లో రూ.505 కోట్లతో స్విచ్చింగ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని ఐదేళ్లుగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులను పట్టాలెక్కించే క్రమంలో ఈ సబ్‌స్టేషన్ పనులను తిరిగి చేపట్టింది. ఐదు నెలల్లో పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ సబ్‌స్టేషన్‌తో రాజధాని అమరావతిలో నిర్మాణం జరిగే సచివాలయం హైకోర్టు, అసెంబ్లీ, రాజ్ భవన్, సీఎం క్యాంప్ కార్యాలయం, ప్రస్తుతం ఉన్న వెలగపూడి సచివాలయం, అసెంబ్లీ హైకోర్టు భవనాలకు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుంది. సబ్‌స్టేషన్ నుంచి రాజధాని ప్రాంతంలో ఎక్కడా స్తంభాలు లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. కొండపల్లి థర్మల్ పవర్ స్టేషన్ నుంచి తాళ్లాయపాలెం స్విచ్చింగ్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు నిరంతరం కరెంట్ సరఫరా అవుతుంది. దీంతో రాజధాని ప్రాంతంలో 24 గంటలు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

తాళ్లాయపాలెంలో సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మరో ఆరు సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలతో పాటు 15 సబ్ స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన, కొత్త విద్యుత్ లైన్లను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తాళ్లాయపాలెంలో అధికారులు భారీగా ఏర్పాట్లుచేశారు. ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తీ చేకూరి తదితరులు పరిశీలించారు. సబ్‌స్టేషన్ ప్రాంగణంలోనే ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు వేదికను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి రాజధాని ప్రాంతవాసులు భారీగా హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దారు సుజాత, నాయకులు పుట్టి రామచంద్రరావు, ధనేకుల సుబ్బారావు, లంకా సుధాకరరావు, కొండెపాటి బుజ్జి, శ్రీహరి, సుబ్రహ్మణ్యం, వాకచర్ల వీరాంజనేయులు, బెజవాడ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



సీఎం ప్రారంభించే విద్యుత్ సబ్ స్టేషన్ పైలాన్

రీజెన్సీ సిరామిక్ ప్రారంభానికి సిద్ధం

- త్వరలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- పరిశ్రమను పరిశీలించిన ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



వేమవరంలో రీజెన్సీ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తదితరులు

బల్లికురవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రీజెన్సీ సిరామిక్ టైల్స్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. సీఎంవో నుంచి వచ్చిన ఆదేశాల మేరకు బుధవారం రీజెన్సీ సిరామిక్ పరిశ్రమను ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, పలు శాఖల అధికారులు పరిశీలించారు. యానాంలో మూతపడిన రీజెన్సీ పరిశ్రమను వేమవరంలో మూత పడి ఉన్న సెగ్సో సిరామిక్‌లో ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. రీజెన్సీ చైర్మన్ జీఎన్ నాయుడు దీనిని ముఖ్యమంత్రితో ప్రారంభింప చేసేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో అధికారులు హెలిప్యాడ్, పొల్యూషన్ తదితరాలను పరిశీలించారు. రీజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ సత్యేంద్ర ప్రసాద్, హెచ్ఆర్ మోహన్‌రావు, తహసీల్దార్ కవిత, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్మినెంట్ లైసెన్సు 74 దుకాణాలకే

- మద్యం ప్రొవిజనల్ లైసెన్సులకు నేటితో ముగియనున్న గడువు
- మరో వారం వ్యవధి ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం



బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులకు ప్రభుత్వం ప్రొవిజనల్ లైసెన్సులు జారీ చేసిన సంగతి తెలిసిందే. తొలుత వీటి గడువు అక్టోబరు 31తో ముగుస్తుందని, నవంబరు 1 కల్లా మద్యం షాపుల యజమానులు పర్మినెంట్ లైసెన్సు పొందాలని ఎక్సైజ్ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. నిర్ణీత తేదీలోగా లైసెన్సుదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కానరాకపోవడంతో నవంబరు 7 వరకు ప్రొవిజనల్ లైసెన్సుల గడువును ఎక్సైజ్‌శాఖ పొడిగించింది. జిల్లాలో ఉన్న 117 మద్యం షాపులకు బుధవారం సాయంత్రానికి 74 మద్యం షాపుల యజమానులు మాత్రమే పర్మినెంట్ లైసెన్సు పొందడానికి కావాల్సిన ప్రక్రియను పూర్తి చేశారు. గడువు గురువారంతో ముగియనుండగా ఒక్క రోజు వ్యవధిలో మిగిలిన 43 మద్యం షాపుల యజమానులు పర్మినెంట్ లైసెన్సు పొందడం సాధ్యం కాదనే అభిప్రాయాన్ని ఎక్సైజ్ శాఖ వెలిబుచ్చుతోంది. పర్మినెంట్ లైసెన్సులపై అంతంతమాత్రంగా స్పందన ఉండడంతో గడువును మరో వారం రోజులు పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన ఆదేశాలు గురువారం వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పర్మినెంట్ లైసెన్సు జారీ చేసే ముందు షాపుల లోకేషన్ విషయంలో క్షేత్రస్థాయిలో విజిట్ చేసిన పిమ్మటే ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకోనున్నది. ఈ ప్రక్రియలో భాగంగా పది మద్యం షాపుల విషయంలో నిబంధనలను పాటించలేదని ఎక్సైజ్‌శాఖ అధికారుల దృష్టికి రాగా సవరించుకోవడానికి ఓ రోజు వ్యవధిని లైసెన్సుదారులకు ఇచ్చింది.

లోకేషన్ విషయంలో మల్లగుల్లాలు

ఇంకా 43 మద్యం షాపుల విషయంలో పర్మినెంట్ లైసెన్సు విషయంలో ఎలాంటి ముందడుగు పడకపోవడానికి లోకేషన్ విషయంలో సదరు యజమానులు తుది నిర్ణయానికి రాకపోవడమే కారణంగా తెలుస్తోంది. ఇంకా కొన్ని కీలక సెంటర్ల షాపుల విషయంలో సిండికేట్ పంచాయితీ నడుస్తూనే ఉండగా, రూరల్ పరిధిలో మద్యం షాపుల యజమానులు ఓ అవగాహనకు వచ్చి వ్యాపారం చేస్తున్నారు. యజమానులు ఏరియాల వారీగా సిండికేట్ అవడం వెనక ఉన్న ప్రధాన ఉద్దేశం భవిష్యత్తులో అక్రమాలకు తెరతీయడానికేనని సమాచారం. ఎమ్మార్పీ ఉల్లంఘనలతో పాటు బెల్ట్ షాపుల విషయంలో కూడా సిండికేట్‌లో ఉన్న షాపుల యజమానులంతా ఒకే మాట మీద ఉండడంతో వారు చెప్పిందే ధరగా మందుబాబుల జేబులు గుల్ల చేసే అవకాశం ఉంది. తమ అక్రమాలకు అడ్డురాకుండా ఉండడానికి అధికారుల వద్దకు ఇప్పటికే రాయబారాలు సాగిస్తున్నారనేది సమాచారం

రైతుల కోసం మార్కెటింగ్

- చెక్‌పోస్టుల్లో అవకతవకలపై దృష్టి
- ఆంధ్రజ్యోతితో మార్కెటింగ్‌శాఖ ఏడీ రమేష్‌బాబు

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ రైతుల కోసం ఉంది. మార్కెటింగ్ విభాగం ద్వారా అన్నదాతల ఉత్పత్తులకు సరైన ధర వచ్చే విధంగా ట్రేడ్ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పిస్తాం. చెక్‌పోస్టుల దగ్గర అవకతవకలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపడతాం. అని మార్కెటింగ్ శాఖ బాపట్ల ఏడీ కె.రమేష్‌బాబు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రైతుల కోసం మార్కెటింగ్ శాఖ చేపడుతున్న పథకాలను బుధవారం ఆయన వివరించారు. మార్కెటింగ్ శాఖ తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.

రైతులు నిల్వకి ఇబ్బంది లేదు

రైతులు వారి పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి వీలుగా గోడౌన్లను అందుబాటులో ఉంచాం. గోదాములను ఇతర సంస్థల అవసరాల కోసం గత ప్రభుత్వ హయాంలో లీజుకు ఇవ్వడం జరిగింది. అవసరమనుకుంటే వాటిని కూడా రైతుల ప్రయోజనాలకే ఉపయోగిస్తాం.

రైతు బజార్ల ఏర్పాటు

ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోని బాపట్ల మార్కెట్ సెంటర్‌లోని రైతుబజారును ఇటీవలే అందుబాటులోకి తెచ్చాం. రేపల్లెలో రైతుబజార్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. సాధ్యమైనంత త్వరగా దీని నిర్మాణం పూర్తి చేస్తాం. రైతుబజార్లలో కూరగాయల ధరలు నియంత్రణలో ఉంచడానికి ఎస్టేట్ ఆఫీసర్‌ను నియమిస్తాం.

రూ.30 కోట్ల లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ యార్డుల పరిధిలోని చెక్‌పోస్టులతో పాటు ఇతరత్రా ఆదాయ లక్ష్యం రూ.30 కోట్లుగా నిర్ణయించడం జరిగింది. వీటిలో ఇప్పటికే 38 శాతం చేరు కున్నాం. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.28 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే రూ.26 కోట్ల వరకు చేరుకోగలిగాం. యార్డుల పరిధిలో రైతులకు కనీస సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపడు తున్నాం.



దరఖాస్తు చేసుకోవాలి

రైతుబజార్‌లో స్టాల్స్ కోసం ఇప్పటికే రైతులకు 59 వరకు దరఖాస్తులు ఇచ్చాం. వీరికి ఎటువంటి రుసుము లేకుండా కేటాయిస్తాం. డ్వాక్రా మహిళలతో పాటు ఇతర స్వయం సహాయక గ్రూపులు ఎవరైనా రైతుబజార్‌లో స్టాల్ కావాల్సి వస్తే జాయింట్ కలెక్టర్‌కి దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనలకు లోబడి అర్హులైన వారికి నిర్ణీత అద్దె ప్రాతిపదికన స్టాల్ కేటాయిస్తాం.

మరమ్మతులకు ప్రతిపాదనలు

జిల్లాలో ఉన్న గోడౌన్ల మరమ్మతులకు గతంలోనే ప్రతిపాదనలు పంపడం వాటిని ఆమోదించడం జరిగింది. పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అవి అంతటితోనే ఆగిపోయాయి. గోడౌన్‌ల మరమ్మతులపై దృష్టిపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అందుకు తగ్గట్లుగా ప్రతిపాదనలపై కసరత్తు చేస్తున్నాం. యార్డుల్లో ధాన్యం ఆరబోసుకోవడానికి రైతులకు కావాల్సిన సదుపాయాలను కూడా కల్పిస్తాం.

పత్తి కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్లు

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం పర్చూరు, మార్టూరు యార్డు పరిధిలో జిన్నింగ్‌మిల్లులను ఎంపిక చేశాం. రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. రైతులు లూజ్ పత్తిని తీసుకురావాలి. లేదంటే గన్నీబ్యాగులలో మాత్రమే పత్తిని మిల్లులకు తరలించాలి.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు

- వచ్చే ఏడాది నుంచి మండలానికో జూనియర్ కళాశాల
- భారీ అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక
- ఇంటర్ కళాశాలల్లో ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షలకు శిక్షణ
- ఈ ఏడాది ఇప్పటికే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ఏడాది ఇప్పటి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన ప్రభుత్వం వచ్చే ఏడాది ప్రతి మండలంలో కనీసం ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా ఆయా కళాశాలల్లో మెరుగైన శిక్షణ ఇవ్వడంతోపాటు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల ఇంటర్ బోర్డు అధికారులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమీక్షలో నూతన విద్యావిధానాలపై విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించారు.



గుంటూరు(విద్య)నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ఇప్పటికే 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రస్తుతం 15వేలమందికిపైగా విద్యార్థిని విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. అంటే ఇంకా దాదాపు సగం మండలాల్లో ప్రభుత్వ లేదా ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు లేవు. ఈనేపథ్యంలో జూనియర్ కళాశాలలు లేని మండలాల్లో కొత్తగా కళాశాలలు ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. ఇందుకు ప్రైవేటువిద్యాసంస్థల్ని ప్రోత్సహించి త్వరితగతిన అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు జాతీయస్థాయిలో పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రస్థాయిలో జరిగే ఎంసెట్‌తోపాటు, జాతీయ స్థాయిలో జరిగే నీట్, జేఈఈ మెయిన్స్‌అడ్వాన్స్‌పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అంతేకాకుండా

(మిగతా 8వ పేజీలో..)

రూ. 4.71 కోట్లతో కాలువల మరమ్మతులు

● జలవనరుల శాఖ ఎస్సీ కృష్ణమోహన్


సమావేశంలో ఎస్సీ కృష్ణ మోహన్, ఈఈలు

నరసరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాచర్ల జలవనరుల శాఖ సబ్ డివిజన్ పరిధిలో కాలువల మరమ్మతులకు రూ. 4.71 కోట్లు విడుదల అయ్యాయనీ, 101 పనులు చేపడుతున్నామని జలవనరుల శాఖ ఎస్సీ కృష్ణ మోహన్ తెలిపారు. నరసరావుపేటలోని సర్కిల్ కార్యాలయంలో మరమ్మతు పనులపై బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదరు పనుల నిర్వహణకు త్వరితగతిన టెండర్లు నిర్వహించాలని ఈఈలను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసి పనుల అగ్రిమెంట్లు స్వీకరించి వెంటనే పనులు చేపట్టాలని సూచించారు. పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. నీటి పారుదలకు అడ్డుగా ఉన్న కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగించాలన్నారు. సమావేశంలో ఈఈ శ్రీహరి, డీఈఈలు మురళీధర్, వెంకట సుబ్బయ్య, ఏఈలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి


బాలింతలకు పోషకాహార కిట్‌లను పంపిణీ చేస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

బాపట్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం బాపట్ల మండలం వెదుళ్లపల్లి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాని, నందిరాజుతోట హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. గతేడాది కన్న ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులకు పెట్టే ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని రికార్డుల్లో సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు సంతకాలు పెట్టాలని సూచించారు. మూడేళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో ఉండేవిధంగా అధికారులు కృషి చేయాలని చెప్పారు. అనంతరం సెంటర్‌లోని కోడిగుడ్లు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహార ప్యాకెట్లను పరిశీలించారు. బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, వివిధశాఖాధికారులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ ఆధారంగా జీతాల్లో కోత అన్యాయం

గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ ఆధారంగా జీతాల్లో కోత విధించటం అన్యాయం అని ఏపీ హంస అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణ బాబుని కలిసిన హంస అసోసియేషన్ నేతలు వినతి పత్రం సమర్పించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు ఆధారంగా కోత విధించిన జీతాలు తిరిగి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కొత్తగా రెగ్యులర్ అయిన ఉద్యోగుల ప్రొబేషన్ ఒక సంవత్సరానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. హంస అసోసియేషన్ నేతల విజ్ఞప్తిపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణ బాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఏపీ హంస అసోసియేషన్‌స్టేట్ అధ్యక్షుడు ఆరవ పాల్, సెక్రటరీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బి.కిరణ్, జిల్లా అధ్యక్షుడు బి.నాగ వర్ధన్, మహమ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

అర్చకులకు పెరిగిన 'గౌరవ'ం

● రూ. 15 వేలకు వేతనం పెంపు
● ఉమ్మడి గుంటూరు జిల్లాలో 362 ఆలయాలకు వర్తింపు
● ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ అమలు


గుంటూరు దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. ఆదాయం లేని చిన్న ఆలయాలకు పెద్ద ఊరట కల్పిస్తుంది. చిన్న ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు గౌరవ వేతనాన్ని పెంచింది. గతంలో ఇస్తున్న దాని కంటే మూడింతలు పెంచి, వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 362 దేవాలయాలను ఎంపిక చేసి, అందులో పని చేస్తున్న అర్చకులకు నెలకు రూ.15 వేలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అర్చకులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బ్రాహ్మణ సంక్షేమానికి సహాయ, సహకారాలు అందిస్తూ, వారికి ఆర్థికంగా చేయూతనిస్తున్నారు.

రూ. 50 వేల ఆదాయం పైబడిన దేవాలయాలకు..

దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని చిన్న ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు మూడింతలు జీతం పెంచారు. వాస్తవానికి ఈ ఆలయాలకు అతి తక్కువ ఆదాయం ఉంటుంది. ఏడాదికి ఆలయ ఆదాయం రూ. 50 వేల నుంచి రెండు లక్షల లోపు ఉంటుంది. ఇలాంటి ఆలయాలకు గతంలో సరైన ఆదరణ లేదు. ధూప దీప నైవేద్యం కూడా లేని పరిస్థితులు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గతంలో కొన్ని ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఆలయాల్లో దేదీప్యమానంగా సంవత్సరాంతం చక్కగా పూజలు జరుగుతున్నాయి. దీంతోపాటు అదనంగా మరికొన్ని ఆలయాలకు చేయూతనిస్తూ, అందులో పని చేస్తున్న అర్చకులకు భారీగా జీతాలు పెంచారు. గతంలో నెలకు రూ.6వేలు తీసుకునే అర్చకుడు ఇప్పుడు రూ.15 వేలు తీసుకోనున్నారు.

మూడు జిల్లాల్లో 362 ఆలయాలకు వర్తింపు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మొత్తం 362 చిన్న ఆలయాలకు వర్తింప చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో 107, బాపట్ల జిల్లాలో 128, పల్నాడు జిల్లాలో 127 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు నెలకి రూ. 15 వేలు గౌరవ వేతనంగా చెల్లించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1683 ఆలయాలను ఎంపిక చేశారు.

జీవో జారీ..

ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎన్డీఏ నేతలు హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగానే అర్చకుల సంక్షేమానికి చేయూతను అందిస్తున్నారు. ఇప్పటికే ఆదాయం లేని ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకం కింద నెలకు రూ.10 వేలు చొప్పున అందిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం తక్కువగా ఉన్న చిన్న ఆలయాలను 6 (సీ-2) గుర్తించి, అందులో పని చేస్తున్న అర్చకులకు నెలకు రూ. 15 వేలు చెల్లించే విధంగా జీవో ఎంఎస్ నంబర్ 261ని బుధవారం జారీ చేసింది. దీంతో ఆ ఆలయాల్లో పనిచేస్తున్న బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



రాష్ట్రంలో చిన్న దేవాలయాలకు ఆదాయం లేదు. దీనిని గుర్తించిన ప్రభుత్వం చేయూత ఇచ్చేందుకు కృషి చేయటం అభినందనీయం. ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. చిన్న ఆలయాల్లో పని చేస్తున్న పేద బ్రాహ్మణులను ప్రభుత్వం ఈ విధంగా ఆదుకోవడం సంతోషకరం.

\- దేవదాయ శాఖ డీసీ కేబీ శ్రీనివాసరావు

సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

(5పేజీ తరువాయి)

ఈదులపాలెం, నడింపాలెం, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, గొట్టిపాడు, కొండ జాగర్లమూడి, గనికెపూడి, పెదనందిపాడులో గొరిజవోలు గుంట పాలెం, యడ్లపాడు మండలంలోని మర్రిపాలెం, ఉన్నవ, కొండవీడు, సొలస, వంకాయలపాడు, మైదవోలు, యడ్లపాడు, విశ్వనాధుని కండ్రిక, జాలాది, తిమ్మాపురం, కారుచోల, నాదెండ్ల మండలంలోని నాదెండ్ల, ఫిరంగిపురం మండలంలోని హవుసు గణేష, రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్, నుదురుపాడు, వేమవరం, బేతపూడి, తాళ్లూరు, యర్రగుంట్లపాడు, సిరంగిపాలెం, తక్కెళ్లపాడు, ముప్పాళ్ల మండలంలోని మాదల, సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు, నందిగామ, కంటెపూడి, భీమవరం, కంకణాలపల్లె, గుడిపూడి, ఫణిదం, అబ్బూరు, పాకాలపాడు, రెంటపాళ్ల, గోరంట్ల, కట్టమూరు, భట్లూరు, వడ్డవల్లి, పెదకూరపాడు మండలంలోని అన్ని గ్రామాలు, అచ్చంపేట మండలంలోని కస్తల అగ్రహారం, కోనూరు, ఓర్వకల్లు, అంబడిపూడి, వేల్పూరు, చిగురుపాడు, మిట్టపాలెం, పెదపాలెం, చామర్రు, అచ్చంపేట, నీలేశ్వరపాలెం, తాళ్లచెరువు, చింతపల్లి, కోగంటివారిపాలెం, క్రోసూరు మండలంలోని అనంతవరం అగ్రహారం, క్రోసూరు, విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం, పారుపల్లి, పీసపాడు, అందుకూరు, బాలెమర్రు, ఉయ్యందన గ్రామాలు ఏపీసీఆర్‌డీలోకి వచ్చాయి.

సీఆర్‌డీఏ ప్రస్థానం..

2014లో ఏపీసీఆర్‌డీఏ ఏర్పడింది. గుంటూరు, ఏలూరు, ఎన్‌టీఆర్, కృష్ణ, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామాలు, పట్టణాలతో దీని కూర్పు జరిగింది. అంతకుముందు ఉన్న వీజీటీఎం ఉడాని రద్దు చేసి పరిధిని పెంచి సీఆర్‌డీఏని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో జోన్లను కూడా ఏర్పరిచింది. అవుటర్ రింగురోడ్డుని కూడా ఎలైన్‌మెంట్ చేసి నిర్మాణం చేపట్టే సమయంలో ఎన్నికలు జరిగి 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే జీఎన్ రావు కమిటీ అని ఏర్పాటు చేసి మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అందుకు అనుగుణంగా 2020లో ఏపీసీఆర్‌డీఏ బిల్లుని రద్దు చేసింది. దీనిపై అమరావతి రాజధాని పరిరక్షణ సమితి రైతులు ఉద్యమించారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో కేసులు వేసి పోరాడారు. ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు స్టే విధించింది. అంతేకాకుండా ఏపీసీఆర్‌డీఏ చట్టం రద్దు చెల్లదని తీర్పు ఇచ్చింది. దాంతో వైసీపీ ప్రభుత్వం 2021లో సీఆర్‌డీఏ చట్టాన్ని పునరుద్ధరించింది. అయితే అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టకపోగా మరోవైపు సుప్రీం కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది.

ఆ మండలాలకు మహర్దశ

కూటమి ప్రభుత్వంలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతుండడంతో పాటు కేంద్రం నుంచి నిధులు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీంతో రాజధాని ప్రాంతంలో వివిధ పనులు చకాచకా జరుగుతున్న సంగతి తెలిసిందే. సీఆర్‌డీఏ పరిధిలో పలు ప్రాజెక్టులు భవిష్యత్తులో క్యూ కట్టనున్నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పలు గ్రామాలు సీఆర్‌డీఏలోకి వెళ్లాయి. దీంతో ఆయా గ్రామాల్లో కూడా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అక్కడి ప్రజలు భావిస్తూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది

వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలను తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనందాన్ని ఇచ్చింది. గత ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం కక్షసాధింపే అజెండాగా తీసుకున్న తలాతోక లేని నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఆ చీకటి నిర్ణయాలను సరిదిద్దే దిశగానే తిరిగి సీఆర్‌డీఏ పరిధిని కూటమి ప్రభుత్వం విస్తరించింది.

\-నక్కా ఆనంద్‌బాబు, వేమూరు ఎమ్మెల్యే

కొలనుకొండ బైపాస్‌లో మహిళలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● తీవ్ర గాయాలు
● మంత్రి సవిత మానవత్వం


ఎన్నారై వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళ వద్ద మంత్రి సవిత

తాడేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి హైవేపై కొలనుకొండ వద్ద బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న నలుగురు మహిళలను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న మంత్రి ఎస్ సవిత తన మానవత్వాన్ని చాటుకుని గాయపడిన వారిని తన వాహనంలో స్వయంగా దగ్గరుండి ఎన్నారై వైద్యశాలకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి...... తాడేపల్లి సమీపంలోని కొలనుకొండ ప్రాంతంలో కూలిపనులకు వచ్చిన నలుగురు మహిళలు హైవే దాటుతుండగా విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొంది. దీంతో వారంతా తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అదే సమయంలో అటుగా వెళుతున్న మంత్రి సవిత స్పందించి క్షతగాత్రులను తన వాహనంలో ఎన్నారై వైద్యశాలకు తరలించి ఆమె కూడా మరో వాహనంలో వారి వెనుకనే ఎన్నారై వైద్యశాలకు వెళ్లి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఓ మహిళ పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు తెలిపారు. తక్షణమే స్పందించి క్షతగాత్రులను తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించిన మంత్రి సవితపై వాహనచోదకులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు. గాయపడిన వారు ఆదిలక్ష్మి, నారాయణమ్మ, సరస్వతి, నారాయణమ్మగా స్థానికంగా ఉండే జయభేరి సిబ్బంది తెలిపారు. గాయపడిన వారు వివరాలు వెల్లడించే పరిస్థితిలో లేరు. వీరిని విజయవాడకు చెందిన వారిగా భావిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అటుపిమ్మట ఎన్నార్ వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ రోడ్డు ప్రమాదంతో తాడేపల్లి హైవేపై దాదాపు కిలో మీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

పవన్ ఆలోచనా విధానం.. రాష్ట్రాభివృద్ధికే


మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ ఆలోచనా విధానాన్ని అందుకునేందుకు వైసీపీ నాయకులు సరిపోరని, తమ అధినేత దృష్టి అంతా రాష్ట్రాభివృద్ధి, ప్రజా శ్రేయస్సుపైనే ఉందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో పోలీసులు, హోం మంత్రి మరింత బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం పవన్ సూచిస్తే, దీనిపై వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పవన్ సూచనలను డీజీపీ, హోం మంత్రి స్వీకరించారని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. పల్నాడు జిల్లాలో సరస్వతి పవర్ భూములను పవన్ సందర్శించకూడదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేయడం హాస్యాస్పదమన్నారు. గురజాల శాసన సభ్యుడుగా పని చేసిన కాసు మహేష్‌రెడ్డికి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఎక్కడుందనీ, ఆయనకు సిగ్గు, ఎగ్గు ఉన్నాయా అని గాదె ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లు ఈ ప్రాంతాన్ని దోచుకుతిన్నారని, అక్కడ రోడ్లపై గుంతలు తప్పా అభివృద్ధి అనేది కనపడదని ఎద్దేవా చేశారు. కాట్రపాడులో సర్వే చేయకుండా 144 ఎకరాల భూమిని ఆక్రమించింది ఎవరో పల్నాడు ప్రజలకు తెలుసని ఆయన విమర్శించారు. పవన్ కల్యాణ్‌పై మంద కృష్ణమాదిగ వ్యాఖ్యలు సరికాదని, పవన్ కుల, మతాలకు అతీతంగా ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడుతున్న నాయకుడని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని గాదె అన్నారు. సమావేశంలో జనసేన కృష్ణా, పెన్నా రీజియన్ మహిళా కోఆర్డినేటర్ పాకనాటి రమాదేవి, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నేతలు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, శిఖా బాలు, చట్టాల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో ఎడ్యుకేషన్‌పై అధ్యయనం

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగపు విద్యార్థులు ఎస్.కె.సమీర్, త్రిపురనేని వసంత బాబులను ఉపకులపతి ఆచార్య కె.గంగాధర రావు, రెక్టర్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం బుధవారం అభినందించారు. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ ఆహ్వానం మేరకు వారం రోజులు సకురా సైన్స్ ప్రోగ్రాంలో భాగంగా వర్సిటీ విద్యార్థులు జపాన్‌లో పర్యటించారు. వారం రోజుల పర్యటనలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులను అభినందించిన వీసీ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం 2014లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జపాన్ లోని టయోమో రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా స్టూడెంట్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంకు ఇద్దరు విద్యార్థులు జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ వారి ఆహ్వానం మేరకు ఆ రాష్ట్రంలో పర్యటించారన్నారు. టయోమో రాష్ట్రంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలను సందర్శించి అక్కడ ఎడ్యుకేషన్, రీసెర్చ్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనం చేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, సహాయ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ చంద్రమౌళి, కోఆర్డినేటర్స్ డాక్టర్ చింక తిరుమలరావు, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వి.బాలాజీ, డాక్టర్ సతీష్, డ్రోన్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

తొలిరోజు ఆంధ్ర జట్టుదే పైచేయి

● యువన్, లోహిత్ సెంచరీలు


ఎం.యువన్


లోహిత్

మంగళగిరి సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీ ప్రారంభమైంది. ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య నాలుగు రోజులపాటు జరగనున్న మ్యాచ్‌లో తొలిరోజు ఆంధ్ర జట్టు పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. ఆంధ్ర బ్యాటర్లు ఎం.యువన్ 117 బంతుల్లో 9 సిక్సర్లు, 5 ఫోర్లతో 122 పరుగులు, లోహిత్ లక్ష్మీనారాయణ 166 బంతుల్లో 6 సిక్సర్లు, 12 ఫోర్లతో 113 పరుగులు సాధించారు. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్ 32 ఓవర్లలో 114 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. కూచ్ బెహర్ ట్రోఫీలో ఆంధ్ర జట్టు గ్రూప్-డిలో ఆడుతుంది. ఆంధ్ర జట్టు ఆడనున్న ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌లు మంగళగిరి ఏసీఏ మైదానంలో జరగనున్నాయి.

గంజాయి విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ పట్టణ ఎస్ఐ ఎం.పవన్ కుమార్‌కు గంజాయి అమ్మకంపై సమాచారం రావటంతో పట్టణంలోని రంగా కాలనీలో తన్నీరు అడివయ్య ఇంటి వద్దకు వెళ్లేసరికి ఇద్దరు వ్యక్తులు ఒక ప్లాస్టిక్ కవరు మధ్యలో పెట్టుకొని కూర్చొని ఉన్నారన్నారు. పోలీసులను చూసి ప్లాస్టిక్ కవరును అక్కడే వదిలి పారి పోయేందుకు ప్రయత్నించగా ఎస్ఐ పవన్ కుమార్ సిబ్బంది సాయంతో వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారిలో రంగా కాలనీకి చెందిన తన్నీరు అడివయ్య, విశాఖపట్నం జిల్లా భూపాలపట్నం గ్రామానికి చెందిన గూడె అప్పన్న ఉన్నారని తెలిపారు. అప్పన్న ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి సత్తెనపల్లిలో అడివయ్యకు విక్రయించగా ఆయన అమ్ముతున్నాడన్నారు. గతంలో రెండు సార్లు అడివయ్యను గంజాయి కేసులో అరెస్టు చేసినట్టు తెలిపారు. తహసీల్దార్ కె. శ్రీనివాస చక్రవర్తి సమక్షంలో ప్లాస్టిక్ కవరును తనిఖీ చేయగా గంజాయి ఆకులు, విత్తనాలు ఉన్నాయన్నారు. రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని కోర్టుకు హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రామకృష్ణ (ఫైల్ ఫొటో)

ముప్పాళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఇరుకుపాలెంలో మంగళవారం జరిగింది. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇరుకుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి భర్త రామకృష్ణ గత పదిహేను సంవత్సరాలుగా తనకు ఉన్న ఐదు ఎకరాలతో పాటు మరికొంత పొలం కౌలుకు తీసుకుని వరి, పత్తి, మిరప పంటలను సాగు చేశాడు. వ్యవసాయంతోపాటు ఎద్దులను కూడా పెంచేవాడు. వ్యవసాయంలో నష్టం రావటంతో తనకు ఉన్న ఐదు ఎకరాలను అమ్మి అప్పులు తీర్చాడు. అయినా అప్పులు తీరక పోవటంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రామకృష్ణ మృతదేహానికి గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ నియోజకవర్గ నాయకులు మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు నివాళులర్పించారు. మృతునికి భార్య విజయలక్ష్మితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు జరిమానా

గుంటూరు(లీగల్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జైలు శిక్ష, నలుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ గుంటూరు 5వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కె.లత బుధవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ పర్యవేక్షణలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ. అశోక్ కుమార్ తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ రైడ్ నిర్వహించి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడుగురిని ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు 5వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చారు. ఈ కేసులను విచారించిన న్యాయమూర్తి ముగ్గురికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో నలుగురికి ఒకొక్కరికి పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 586.30 అడుగులు ఉంది. ఇది 301.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4679 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,979 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 12,827 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 9,595 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

50,326 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 54,072 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,326 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,952 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	9000	15000
నెంబరు. 5	9500	13500	నెంబరు. 5	10000	12000
273	10300	12300	273	13500	13500
341	8500	15000	341	8200	16300
4884	9000	13500	4884	11000	12500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	17200	తేజ	8500	17200
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	10800

ప్రాంతీయ వైద్యశాలకు ఫ్రీజర్ బాక్స్ అందజేత

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ప్రాంతీయ వైద్యశాల మార్చురీకి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రీజర్‌బాక్స్ అందజేశారు. డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మకు చీరాల పూర్వీస్కాన్‌సెంటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో మరియమ్మ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చీరాల బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీదేవి, బాపట్ల బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ హక్కు, కార్యదర్శి డాక్టర్ మధుసాల్మన్, ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ, డాక్టర్ సుజాత, డాక్టర్ రూపప్రియాంక పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ

కర్లపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా అన్నారు. కర్లపాలెంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యల కరపత్రాలను కార్మికులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. కరీముల్లా మాట్లాడుతూ ఇసుక తవ్వకం ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వకుండా ఇసుక ర్యాంప్‌లను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 11న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పఠాన్ జెలీల్‌ఖాన్, కోటిరెడ్డి, ఎస్.సమ్మద్, షేక్ కాశీం పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా శాంతారావు నియామకంపై హర్షం

రేపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణకులానికి చెందిన వైద్యశాంతారావు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ఎన్నికైనందుకు రేపల్లె నాయీబ్రాహ్మణుల సేవాసంఘం సభ్యులు తంగెళ్ళమూడి సాయిబాబు, కుటుంబసభ్యులు అభినందించారు. వెనుకబడిన కులానికి చెందిన వైద్య శాంతారావుకు టీటీడీసభ్యులలో స్థానం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు కందుకూరి అనిల్, బి.నరసింహారావు, కె.మోహన్‌కుమార్, శ్రీనివాస్, తులం రమేష్‌బాబు, ధూళిపూడి బసవయ్య, పత్తిపాటి లక్ష్మీనరసింహ, పులివర్తి కిరణ్‌కుమార్, వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల మిస్సింగ్ క్రెడిట్ సమస్యను పరిష్కరించాలి

భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ ఉద్యోగుల మిస్సింగ్ క్రెడిట్ సమస్యను పరిష్కరించాలని సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ అన్నారు. మండల పరిధిలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబరు 1 తరువాత నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులు మిస్సింగ్ క్రెడిట్ సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగి వేతనం నుంచి ప్రతి నెలా 10 శాతం ప్రభుత్వ వాటాగా మినహాయింపు జరుగుతుందని, ఆ మినహాయింపు వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. సకాలంలో సీపీఎస్ ఉద్యోగుల 10 శాతం ప్రభుత్వ వాటాను విడుదల చేయాలని కోరారు.

రేపటి నుంచి దీక్షాపరులకు చద్ది కార్యక్రమం

బాపట్లరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీగంగాపార్వతి సమేత శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 8వ తేదీ నుంచి మాల ధారణ భక్తులకు 41 రోజుల చద్ది కార్యక్రమం ప్రారంభమౌతుందని గురుస్వామి సుబ్బారావు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో 23వ సారి ఉభయదాతగా ఈ చద్ది కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని చెప్పారు. అయ్యప్పస్వాములు, శివస్వాములు, భవానీస్వాములు, గోవిందస్వాములు ఈ చద్ది కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

రబీ బీమాకు మార్గదర్శకాలు విడుదల

● ఏడీఏ లక్ష్మి



బాపట్ల, నంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమాకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసినట్లు బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించిందన్నారు.



ప్రశ్న : రబీ పంటల బీమా ప్రీమియం ఎప్పటిలోగా చెల్లించాలి?

ఏడీఏ : వరి పంటకు డిసెంబరు 31వ తేదీలోపు, మిగిలిన పంటలకు డిసెంబరు 15వ తేదీలోపు నామమాత్రంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

ప్రశ్న : ఏయే పంటలకు ఎంత ప్రీమియం చెల్లించాలి?

ఏడీఏ : వరి పంటకు రూ.126, శనగ పంటకు రూ.84, మొక్కజొన్నకు రూ.105, జొన్నకు రూ.38, పెసరకు రూ.36, మినుముకు రూ.60, వేరుశనగకు రూ.60 చొప్పున రైతు ప్రీమియంగా చెల్లించాలి.

ప్రశ్న : ఏ ప్రాతిపదికన బీమా కేటాయిస్తారు?

ఏడీఏ : వరిని గ్రామం యూనిట్‌గా, వేరుశనగను జిల్లా యూనిట్‌గా, మిగిలిన పంటలను మండలం యూనిట్‌గా బీమా అమలు చేస్తారు.

ప్రశ్న : రైతులు ఏవిధంగా బీమా నమోదు చేసుకోవాలి?

ఏడీఏ : రైతులు సంబంధిత గ్రామాలలో కామన్ సర్వీస్ కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డు, పొలం ధ్రువీకరణపత్రాలు, సీసీఆర్సీ కార్డు, సాగు ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్ పుస్తకం ఇస్తే బీమా సౌకర్యం కల్పిస్తారు.

ప్రశ్న : రైతు ఇంకా ఏమి నమోదు చేసుకోవాలి?

ఏడీఏ : పంటల బీమాలో నమోదైన రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంటలో వివరాలు నమోదు చేసుకోవాలి.

ఆక్రమణలో హాస్టల్ భవనం

● పది ఏళ్ల నాడు మూతపడ్డ వైనం
● తొమ్మిది కుటుంబాలు నివాసం
● పట్టించుకోని అధికారులు



వేమూరు దళితవాడలో ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్ భవనం



మూతపడిన భవనంలో కాపురం ఉంటున్న కుటుంబాలు

వేమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేమూరు దళితవాడలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్ భవనాన్ని స్థానిక కుటుంబాల వారు ఆక్రమించుకున్నారు. పది ఏళ్ల క్రితం ప్రభుత్వ హయాంలో మూతపడ్డ హాస్టల్ భవనం విషయంపై సోషల్ వెల్ఫేర్ అధికారులు దృష్టి పెట్టడం లేదు. తాళాలు వేసి ఉన్న భవనాన్ని ఏడు సంవత్సరాల నాడు స్థానిక తొమ్మిది కుటుంబాల వారు ఆక్రమించుకుని యథేచ్ఛగా కాపురాలు చేస్తున్నారు. ప్రభుత్వ భవనాన్ని ఆక్రమించుకున్నారు ఏమిటి అని ప్రశ్నిస్తే ప్రభుత్వం తమకు నివేశన స్థలాలు ఇవ్వలేదని అందువల్లనే హాస్టల్‌లో ఉంటున్నట్లు సమాధానమిచ్చారు. దీనిపై ఆరా తీస్తే తొమ్మిది కుటుంబాల వారికి ప్రభుత్వం స్థలాలు కేటాయించినట్లు తెలుస్తోంది. వేమూరులో ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎక్సైజ్ శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాలలో వాటిని నిర్వహిస్తున్నారు. మూతపడ్డ హాస్టల్ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగిస్తే ప్రభుత్వ ఖర్చు కూడా తగ్గుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని సోషల్ వెల్ఫేర్ శాఖ హాస్టల్ భవనాన్ని ఖాళీ చేయించి సంబంధిత శాఖలకు అప్పగించాలని స్థానికులతో పాటు కొందరు ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసు వివరణ

స్థానికులు హాస్టల్ భవనాన్ని ఆక్రమించుకున్న మాట వాస్తవమేనని, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి అధికారులు తమకు దరఖాస్తు చేస్తే ఆ భవనాన్ని వారికి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని శ్రీనివాసు తెలిపారు.

ముఖ్యమంత్రి ప్రకటనతో క్రీడారంగానికి మహర్దశ

● జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.పాల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న పాల్‌కుమార్ తదితరులు

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రీడారంగానికి మహర్దశ తీసుకొచ్చారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.పాల్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై బుధవారం కేవీకే స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన క్రీడాపాలసీ వల్ల క్రీడారంగానికి మహర్దశ పడుతుందన్నారు. ఈ నిర్ణయం పట్లకోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాప్రముఖులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఒలింపిక్స్‌లో బంగారుపతకం సాధించిన వారికి రూ.7 కోట్ల నజరాన ప్రకటించటం హర్షణీయమన్నారు. ఆసియా, జాతీయ క్రీడలలో పతకాలు సాధించిన విజేతలకు భారీ ప్రోత్సాహకాలు అందజేయటం శుభపరిణామన్నారు. ఉద్యోగ నియామకాలలో స్పోర్ట్స్ కోటా 3 శాతానికి పెంచటం సంతోషదాయకమన్నారు. క్రీడాకారులపై, క్రీడారంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఉన్న నిబద్ధతకు నూతన క్రీడాపాలసీ అద్దం పడుతుందని కొనియాడారు. సమావేశంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరి ఎస్‌కె.కరీముల్లా, పీడీలు కత్తి శ్రీనివాసరావు, తిరుపతిరావు, కుటుంబరావు, విష్ణుప్రసాద్, కోటేశ్వరరావు, ఎం.సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

అర్చకులకు ఆర్థిక భరోసా అభినందనీయం

● అర్చక సేవాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిచంద్



సమావేశంలో మాట్లాడుతున్న గోపిచంద్ తదితరులు

పిట్టలవానిపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిన్న దేవాలయాల అర్చకుల జీవితాలకు ఆర్థిక భరోసానిచ్చి మాట నిలుపుకున్న కూటమి ప్రభుత్వానికి అర్చక సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్ కృతజ్ఞతలు తెలిపారు. పిట్టలవానిపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్చకులకు కనీస వేతనం రూ.15 వేలు అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, దేవదాయశాఖాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో అర్చక సేవాసంఘం సభ్యులు శేషగిరిరావు, మేడూరి శ్రీనివాసమూర్తి, శ్రీనుబాబు, గూడూరి శ్రీనుబాబు, సత్యంబాబు, చావలి సురేష్, వంశీ చందు, వెంకటశేషాచార్యులు, యోగానంద, బాలకృష్ణ, చక్రపాణి పాల్గొన్నారు.

రైతుబజారును పరిశీలించిన కమిషనర్



రైతుబజారును పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్, రైతుబజారును కమిషనర్ జి.రఘునాధరెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైతుబజారులో వసతులను పరిశీలించి వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయలక్ష్మీపురంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరిస్తూ హానికరమైన వ్యర్థాలను ప్రతిరోజు వేరు చేసి మాత్రమే ప్రజల వద్ద నుంచి సేకరించాలని చెప్పారు. తాగునీటి సరఫరా విషయమై ఆయా ప్రాంత ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో షేక్ జబ్బార్, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు, రైతుబజారు నిర్వాహకులు ఫణేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరులో దూడల ప్రదర్శన

కొల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. కొల్లూరులోని ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, పశు వైద్యశాలలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహారావు, లేగదూడల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టిన లేగదూడలు ఆరోగ్యవంతంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ, పశు గణాభివృద్ధి కోసం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్ఎస్ వీర్యం ప్రయోజనాలను పశు పోషకులకు శాస్త్రవేత్తలు వివరించారు. దూడల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఫైనేని మురళీకృష్ణ, డీఏహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్, డీఎల్‌డీఏ డాక్టర్ బాలశంకర్, డీడీ డాక్టర్ ప్రభావతి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేవీ జనార్ధనరావు, యశ్వంత్, చలపతి, శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్, పారా సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి చూపించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కొల్లూరు, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : కూలీలందరికి ఉపాధి చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొనిగల సుబ్బారావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆవులవారిపాలెంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి బుధవారం కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కృష్ణానది వరదల వల్ల మండలంలోని లంక గ్రామాల్లో పనులు లేక కూలీలు పూట గడవని పరిస్థితులు ఎదుర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఉపాధి పనులు కల్పించాలని పనైనా చూపండి.. తిండైనా పెట్టండి అని ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. దీంతో రెండు గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పన జరిగిందని మిగిలిన 10 గ్రామాల్లో కూడా వెంటనే ఉపాధి పనులు కల్పించి కూలీలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇస్సాకు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలి : సీపీఐ

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పేదల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెబి.శ్రీధర్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ తాగునీటి కుళాయిలు, సీసీ రోడ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పార్కులు, వీధి దీపాలు వంటివి వసతులు కల్పించాలన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్కా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ప్యాడిసన్‌పేట, మూలపాలెం, బేతనీకాలనీలలోని లేఅవుట్‌లతోపాటు మార్కెట్‌యార్డు ఎదురు ప్రభుత్వ భూమిలో నివసిస్తున్నవారికి, వైఎస్సార్ నగర్, డ్రైవర్స్‌కాలనీలలో నివసిస్తున్న వ్యవసాయ కూలీలకు అన్ని సదుపాయాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు మామిడి బత్తుల అశోక్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

'దున్నేవానికే భూమికై పీడిత ప్రజలు ఉద్యమించాలి'

బాపట్ల, నవంబరు 06 (ఆంధ్రజ్యోతి) : దళిత, ఆదివాసి, పీడిత ప్రజానీకం విముక్తి కోసం దున్నేవానికే భూమికై ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శీలం ఏసమ్మ పిలుపునిచ్చారు. భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల వర్ధంతి సభ సీపీఐ(ఎంఎల్) న్యూడెమెక్రసి జిల్లాకమిటీ ఆధ్వర్యంలో బుధవారం మాదాల నారాయణస్వామికాలనీలో నిర్వహించారు. ఏసమ్మ మాట్లాడుతూ అనేక పోరాటాలలో వేలాది మంది తమ జీవితాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌వి కృష్ణ, ఎఐకెఎమ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.పోతురాజు, జిల్లా కోశాధికారి డి.రాములమ్మ, శంకర్, లాజర్, మరియమ్మ, నాంచారమ్మ, ప్రభావతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఐటీఐ అప్రంటీస్‌షిప్‌కు దరఖాస్తుల స్వీకరణ

కర్లపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో అప్రంటీస్‌షిప్ చేయుటకు ఐటీఐలో ఉత్తీర్ణులైన ఆసక్తిగల అభ్యర్థులు నుండి ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ వినీలిమా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమగోదావరిజిల్లాలో ఐటీఐలో ఉత్తీర్ణులైన ఆసక్తిగల అభ్యర్థులు అప్రంటీస్‌షిప్ కొరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఏపీపీఆర్ఈఎస్‌టిఐసిఈఎస్‌హెచ్‌ఐపిఐఎన్‌టిఐఎ.జీవోబి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో జిల్లాల వారిగా దరఖాస్తు చేసుకోవాలని నీలిమా తెలిపారు. అప్రంటీష్ అభ్యర్థులు ఐటిఐ మార్క్స్, సీనియార్టి ప్రకారం ఎంపిక చేయబడుతారన్నారు. పూర్తి వివరాలు కొరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్‌టీసీ.ఏపీ.జీవోబి.ఇన్ వైబ్‌సైట్ చూడాలని నీలిమా తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు తీవ్రగాయాలు



ఏరియావైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళ

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కోతుల దాడులు నానాటికి పెరిగిపోతున్నాయి. ఏ సమయంలో కోతుల మూక వచ్చి దాడి చేస్తాయో తెలియక ప్రజలు భయపడుతున్నారు. ఇటీవల విజయలక్ష్మీపురంలో ఓ మహిళ కూరగాయల తట్టతో వస్తుండగా కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అదేవిధంగా బెస్తపాలెంలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకుడు శేష కృష్ణ కుమారుడిపై కోతులు దాడి చేస్తుండగా అడ్డుకోబోయి కిందపడటంతో చేయి విరిగి ఆపరేషన్ చేయించుకున్నారు. అలాగే న్యాయవాదిపై కోతుల మూక దాడిచేయటంతో తీవ్రంగా గాయపడి డాబా మీద నుంచి కింద పడ్డారు. బుధవారం కొత్రావారి బజారులో ఓ మహిళపై ఇదే తరహాలో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ప్రస్తుతం ఈమె ఏరియావైద్యశాలలో చికిత్స పొందుతున్నది. కోతుల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవటంలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి కాగా ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డిని వివరణ కోరగా తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి మహిళను అక్షరాస్యులుగా చేయటమే లక్ష్యం : ఎంపీడీవో



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళను అక్షరాస్యులను చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండల సమైక్య ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ ఆడల్ట్ ఎడ్యుకేషన్‌పై బుధవారం వలంటీర్లకు, టీచర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ఏపీఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో ఉన్న చదవటం, రాయటం రాని మహిళలకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాలు నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీంద్రబాబు, జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ సుందరమ్మ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పీసీలు రాఘవ, శివకోటేశ్వరరావు, శివప్రభ, అకౌంటెంట్ లక్ష్మి, వలంటీర్ టీచర్‌లు పాల్గొన్నారు.

స్టూవర్టుపురంలో 300 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

బాపట్లరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలో నాటుసారా తయారీ స్థావరాలపై బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖాధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె.విజయ ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించటం జరిగిందని బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.గీతిక తెలిపారు. మొత్తం 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ప్రభుదాసు, ఎస్.మౌనిక, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లం ఊటను ధ్వంసం చేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు

పిట్టలవానిపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, సలహా కేంద్రాన్ని వినియోగించుకొని ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రులందరికి పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని పిట్టలవానిపాలెంలో ప్రారంభించటంలో సహకరించిన టీడీపీ మండల అధ్యక్షుడు ఎండి అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బడుగు కృష్ణ తదితర టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ కార్యాలయ సిబ్బంది గోపి, బాలకృష్ణ, ఐటీడీపీ సభ్యులు ఎం.శేషికుమార్ పాల్గొన్నారు.

నేడు సచివాలయ సిబ్బందికి శిక్షణ

కొల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం 11 గంటలకు యువత భవితకు భరోసా నైపుణ్య గణనపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి : కలెక్టర్

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఆధార్, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆధార్,రేషన్‌కార్డుల మంజూరుపై మండల తహసీల్దార్‌లతో బుధవారం కలెక్టరేట్ నుంచి ఆయన సమీక్షించారు. ఆధార్ కార్డులు లేక ఎస్టీలు నష్టపోతున్నారని కలెక్టర్‌కు చెప్పారు. అర్హులైన వారందరికి రేషన్ కార్డులివ్వాలని, జనన, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికి చేరవేయటమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు, డీఎల్‌డీవోలు, తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోగా గంగాధర్‌గౌడ్ బాధ్యతల స్వీకారం



కలెక్టర్ జె.వెంకటమురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారిగా జి.గంగాధర్ గౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు అమరావతి సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్ట్ చేశారు. గంగాధర్‌గౌడ్ కడప డీఆర్‌వోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆహార భద్రతా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు

● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చింతా విజయప్రతాప్‌రెడ్డి



పౌరసరఫరాలశాఖ గోదాములలో బియ్యం పరిశీలిస్తున్న చింతా విజయప్రతాప్‌రెడ్డి

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆహారభద్రతా ప్రమాణాలు పూర్తి స్థాయిలో మెరుగుపడేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చింతా విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. బాపట్ల పట్టణ, మండలంలో బుధవారం ఆయన విస్తృత తనిఖీలు నిర్వహించారు. బాపట్ల లోని పౌరసరఫరాలశాఖ గోదాంను తనిఖీ చేశారు. ఫోర్టిఫైడ్ బియ్యం పరిశీలించి బస్తా బియ్యం కాటా వేయించారు. అయితే 50 కిలోలు ఉండాల్సిన బియ్యం బస్తాలో 46.5 కిలోలు మాత్రమే ఉండటంతో మరికొన్ని తూకం వేయించారు. డీలర్లకు ఇబ్బంది లేకుండా రేషన్ సక్రమంగా తూకం వేయించి ఇవ్వాలని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేశారు. ఈతేరు గ్రామంలో రేషన్‌దుకాణం, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసి పలుసూచనలు చేశారు. నందిరాజుతోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నబోజన పథకాన్ని పరిశీలించి ఆహార నాణ్యతను రుచి చూచి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహార విషయంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. తదుపరి ఇంటిగ్రేటెడ్ హాస్టల్, గురుకుల పాఠశాలలో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఈబీ విలియమ్స్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ దేవరాజు, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి జె.రాజదెబోరా, ఐసీడీఎస్ పీడీ కె.ఉమా, ఇన్‌చార్జి సీడీపీవో జి.జ్యోతి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి, డాక్టర్ ఎస్.విజయమ్మ, డిప్యూటీ డీఈవో జి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సలీమా, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాద్, తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్‌లు నాగేశ్వరరావు, రామదాసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్

జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం బాపట్ల విచ్చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ జె.వెంకటమురళిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి వివిధ అంశాలపై మాట్లాడారు.

జనసేన కార్యకర్తలు మరింత పట్టు బిగించాలి : అమ్మిశెట్టి

చుండూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జనసేన కార్యకర్తలు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ పట్ల ఆదరణ పట్టు పెంచుకునే విధంగా కృషి చేయాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అమ్మిశెట్టి శ్రీరామమూర్తి తెలిపారు. మున్నంగివారిపాలెంలో బుధవారం కార్యకర్తల సమావేశంతో పాటు నూతన సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హామీలు అమలు పరచడంతో పాటు గంజాయి, రౌడీయిజం వంటివి తుద ముట్టిస్తుంది. మోదుకూరు నుంచి గ్రామస్థుల మన్నన పొంది సేవాదృక్పధం కల యువత నాయకులు పద్యాల కేశవ, బాలకృష్ణలకు పార్టీ సభ్యత్వం అందించి సత్కరించారు. వివిధ గ్రామాల నుంచి పార్టీలోకి నూతనంగా చేరిన వారికి సభ్యత్వాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా సీనియర్ నాయకులు ఇక్కుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకున్న మాజీ ఎమ్మెల్యే చీరాల



చీరాల గోవర్ధనరెడ్డికి సభ్యత్వం కార్డు అందజేస్తున్న తాతా జయప్రకాష్ నారాయణ

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి బుధవారం పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ సభ్యత్వం కార్డును గోవర్ధనరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సభ్యత్వం తీసుకొని పార్టీ అందించే కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

రేపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని నిజాంపట్నం ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరక్షరాస్యులను గ్రామంలో గుర్తించి వారిని అక్షరాస్యులుగా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఎం మస్తాన్‌రావు మాట్లాడుతూ మహిళా వలంటీర్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి శిక్షణనిచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం డీవోఏలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.జ్యోతిలక్ష్మి, సీసీలు శేషగిరిరావు, శేషావతారం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నాగలక్ష్మి

పాతనందాయపాలెం ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకుడు వెంకట శివనాగిరెడ్డి తదితరులు

కర్లపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతనందాయపాలెం గ్రామంలో గ్రామపెద్దల సహకారంతో ముఖమండప ద్వారాన్ని నిర్మాణం చేసేందుకు బుధవారం టీడీపీ నాయకులు కుంచాల వెంకట శివనాగిరెడ్డి, గ్రామపెద్దలు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పులిచర్ల నరేంద్రరెడ్డి, రావి గోవిందరెడ్డి, రావి శ్రీనివాసరెడ్డి, పగడం చంద్రబాబురెడ్డి, రావి నరసారెడ్డి, కాపూరి శ్రీనివాసరెడ్డి, కాపూరి మురళి, తంత్రి సురేష్, కుంచాల నాగిరెడ్డి, రావి భావన్నారాయణరెడ్డి, పోతురాజు కోటేశ్వరరావు, ఆట్ల అంజిరెడ్డి, అక్కల రమణరెడ్డి, చీరాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్జీరంగా.. రైతు బాంధవుడు

నేడు 124వ జయంత్యుత్సవాలు

స్వాతంత్ర్య సమరయోధుడిగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, రైతు ఉద్యమ నేతగా పేరుగాంచారు ఆచార్య ఎన్జీరంగా. ఆయన పూర్తి పేరు గోగినేని రంగనాయకులు. ఆయన పోరాటయోధుడిగానే కాకుండా సాహిత్య వేత్తగా గుర్తింపు పొందారు. సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసి, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డులు అందుకున్నారు. గాంధీజీని అనుసరించిన ఆయన కాంగ్రెస్‌తో విబేధించి స్వతంత్ర పార్టీ, కృషికార్ లోక్ పార్టీలను స్థాపించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన సందర్భాలూ ఉన్నాయి. రైతుల సంక్షేమం కోసం అనుక్షణం పోరాడిన ఎన్జీరంగా, రాజకీయాలోకి రైతులను తీసుకురావాలని నిడుబ్రోలులో రామానీయుడు రాజకీయ పాఠశాలను స్థాపించి తదనంతర కాలంలో పూర్తిస్థాయి రాజకీయ పాఠశాలగా రూపొందించారు. ఆయన 124వ జయంత్సోవాలను నవంబరు 7వ తేదిన ఘనంగా నిర్వహించేందుకు పొన్నూరు, గుంటూరులోని లాం, ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.


పొన్నూరుటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్జీరంగా గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో నవంబరు 7, 1900 సంవత్సరంలో గోగినేని అచ్చమాంబ, నాగయ్య దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులోని ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న ఆయన గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల నుంచి పట్టభద్రులయ్యారు. 1926లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రం అభ్యసించారు. తిరిగి భారతదేశానికి వచ్చి మద్రాసులోని పచ్చియప్ప కళాశాలలో ఆర్థికశాస్త్ర ఆచార్యులుగా 1930 వరకు పనిచేసారు. 1924లో మాచవరం గ్రామానికి చెందిన భారతీదేవిని వివాహం చేసుకున్నారు. ఆచార్యులుగా పనిచేసే సమయంలో మహాత్మాగాంధీ పిలుపు మేరకు ఉద్యమాన్ని వదిలి స్వాతంత్ర్య ఉద్యమ సమరంలో అడుగుపెట్టారు.

ఉద్యమ నేపథ్యంలో.....

గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగు పెట్టిన ఎన్జీరంగా తదనంతర కాలంలో రైతులలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి రైతు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉద్యమంలో రైతులను భాగస్వాములను చేసి ఉద్యమాలను పతాకాస్థాయికి తీసుకెళ్ళారు. అదే సమయంలో 1931 డిసెంబర్‌లో అరెస్టు అయి ఏడాది కాలం జైలు శిక్ష అనుభవించారు. 1933 సంవత్సరంలో మహాత్మాగాంధీజి చేతుల మీదుగా నిడుబ్రోలులో రామానీయుడు వయోజన రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. 1940లో మద్రాసులో శాసన ఉల్లంఘన ఉద్యమం చేసి జైలుకు వెళ్లారు. 1941లో జైలు నుంచి విడుదలైన రంగాను తిరిగి రాయవెల్లూరు జైలుకు పంపి 1942లో విడుదల చేసారు. తిరిగి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనందుకు 1942 నవంబరున రంగాను నిర్బంధించిన ఆంగ్లేయులు రాజపుట్లానా వద్ద ఉన్న దామో జైలులో ఉంచి 1944లో విడుదల చేసారు. జైలులో ఉన్న కాలంలో ఎన్జీరంగా సాహిత్యంపై మక్కువతో అనేక రచనలు చేసారు. మొత్తం 6 ఏళ్ల జైలు జీవితం గడిపారు.

ఎన్జీరంగా రచనలు

ఆచార్య ఎన్జీరంగా ఆంగ్లబాషలో 65 పుస్తకాలు, తెలుగులో 15 పుస్లకాలను రాసారు. రైతు కూలీల కోసం, ప్రత్యేక ఉద్యమాన్ని రూపొందించి మహాత్మగాంధీతో జరిగిన చర్చల సారాంశాని బాపు ఆశీస్సులు పేరుతో పుస్తకం రచించారు. నేలగిరి కొండజాతులు, ఆధునిక రాజ్యాంగ సంస్థలు, కాకతీయ నాయకులు, కిసాన్ అండ్ కమ్యూనిటీస్, ఛాలెంజ్ ఆఫ్ ద వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్, రైతు భజనావలీ, ప్రపంచ ధనిక వాదం, ధన్యజీవి నేతాజీ, శారదార్పన, భారతీదేవి స్మృతులు, విప్లవ రైతాంగం, ఫైట్ ఫర్ ఫ్రీడమ్, పీజెంట్స్ అండ్ కోఆపరేటీవ్ ఫార్మింగ్, ఎకనామిక్ ఆరనైజేషన్ ఆఫ్ ఇండియన్ విలేజెస్, ది ఎకనామిక్స్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ వంటి రచనలే కాకుండా ఆర్థిక శాస్త్రంలో పలు పరిశోధన గ్రంథాలను రచించారు.



మహాత్మాగాంధీతో ఆచార్య ఎన్జీరంగా

ఎందరికో రాజకీయ ఓనమాలు....

నిడుబ్రోలులో ఏర్పాటు చేసిన రామానీడు రాజకీయ పాఠశాల ద్వారా దేశవాప్తంగా ఎంతో మంది రైతులను, సామాన్యులను ఉత్తమ రాజకీయ వేత్తలుగా తీర్చిదిద్దారు. మహాత్మగాంధీజి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పాఠశాలకు దేశం నలుమూల నుంచి ఉత్తములను ఎంపిక చేసి పాఠశాల్లో రాజకీయ ఓనమాలు దిద్దించారు. ప్రారంభంలో రాజకీయ ఆర్థిక, కార్మిక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలో శిక్షణ ఇచ్చారు. అయితే ఈ పాఠశాలను కాలక్రమంలో రాజకీయ పాఠశాలగా రూపాంతరం చెందించారు. ఈ పాఠశాల దేశానికి ఎంతో మంది ముఖ్యమంత్రులను, మంత్రులను అందించింది. ఆచార్యా ఎన్జీరంగా శిషులుగా గుర్తింపు పొందిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, కొణిజేటి రోశయ్య. ఆర్ ఎం సింగ్ దేవ్ (ఒరిస్సా), చిమన్‌భాయ్ పటేల్ (గుజరాత్), అన్నాదురై (తమిళనాడు), దామోదరం సంజీవయ్య, బెజవాడగోపాళరెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి తదితరులు ఈ పాఠశాల్లో రాజకీయ పాఠాలు నేర్చుకున్నవారే అంతే కాకుండా సర్దార్ గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, రాజగోపాల్ నాయుడు, వీరాచారి, జీయర్ దాస్, అనగాని భగవంతరావు, యడ్లపాటి వెంకట్రావు, గోవాడ పరంధామయ్య, ఔతు రామిరెడ్డి తదితరులు మత్రులుగా పనిచేసారు. ఈ పాఠశాలో విద్యను అభ్యసించిన ఎందరో దేశంలో పలు రాష్ట్రాలో పార్లమెంట్ సభ్యులుగాను ఎంపికైయ్యారు. నేటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సైతం ఆచార్య ఎన్జీరంగా శిష్యులుగా గుర్తింపు పొందారు.



అనేక రంగాల్లో గుర్తింపు పొందిన ఆచార్య ఎన్జీరంగా 124వ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గుంటూరులోని లాం, ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో నేడు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చన్నయుడు, అనగాని సత్యప్రసాద్‌లు హాజరు కానున్నారు. అంతే కాకుండా జిల్లాలోని ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, బూర్ల రామాంజనేయులు. రైతు సంఘం నాయకులు యలమంచలి శివాజి, వడ్డే శోభనాదీశ్వరరావు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు తదితరులు హాజరు కానున్నారు.

రాజకీయ అరంగేట్రం

1936లో భారతీయ కాంగ్రెస్ లక్నో సమావేశం సందర్భంగా ఎన్జీరంగా అఖిల భారత కిసాన్ సభ స్థాపించి మొదటి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దీని ద్వారా జమిందారీ వ్యవస్థ రద్దు చేయాలని గ్రామీణ రుణాలను రద్దు చేయాలని పోరాటం జరిపారు. 1946లో రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా ఎన్నికైయ్యారు. 1952లో తాత్కాలిక పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైయ్యారు. అయితే 1951లో కాంగ్రెస్ పార్టీ నుంచి వేరుపడి కృషి కార్ లోక్‌పార్టీని స్థాపించారు. 1955లో కాంగ్రెస్, ప్రజా పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికలో విజయం సాధించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కోరిక మేరకు కృషి కార్ లోక్‌పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసారు. 1957లో తెనాలి నంచి లోక్ సభకు ఎన్నికైయారు. అయితే నెహ్రూ విధానాలను వ్యతిరేకిస్తూ తిరిగి కాంగ్రెస్ పార్టీని వీడారు. తదనంతర కాలంలో స్వతంత్ర పార్టీని స్థాపించారు. 1962లో జరిగిన సార్వత్రిక ఎన్నికలో 25 స్థానాలను గెలుపొంది బలమైన ప్రతిపక్షంగా స్వతంత్ర పార్టీని నిలిపారు. 1972లో ఇందిరా గాంధీ నేత్రత్వంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1991 వరకు సుదీర్ఘ కాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును అందుకున్నారు. మొత్తం 60 ఏళ్లపాటు ఉభయ పార్లమెంట్ సభ్యులగా పనిచేసి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా..





తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా గురజాలకు చెందిన జంగా కృష్ణమూర్తి, మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవి గురువారం తిరుమలలో ప్రమాణ స్వీకారం చేశారు.

జాతీయ స్థాయి తైక్వాండోకు విజ్ఞాన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య),నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని వీసీ ఆచార్య పీ నాగభూషణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు సామ్యూల్‌చార్లీ, డీ హర్షిత్, వీ నిఖిల, ఎండీ కరిష్మ, ఎంఎం ఆపంటే తదితరులు జాతీయ స్థాయిలో త్వరలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు అభినందించారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల

- ఈ నెల 9న ప్రవేశ పరీక్ష..
- రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. గురువారం వరకు అపరాధ రుసుము లేకుండా ప్రవేశ పరీక్ష ఫీజు రూ.500 చెల్లించవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేయని అభ్యర్థులు నేరుగా టెన్త్ క్లాస్, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా అభ్యర్థి ఫొటోతోపాటు రూ.1500 తత్కాల్ ఫీజు చెల్లించి, పరీక్ష జరిగే 9వ తేదీన నేరుగా హాజరు కావచ్చన్నారు. సంబంధిత ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 10న సాయంత్రం విడుదల చేస్తామని చెప్పారు.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు

(5వ పేజీ తరువాయి)

వృత్తి విద్యాకళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సులో శిక్షణ ఇచ్చి ఎంసెట్, జేఈఈ , నీట్ పరీక్షలకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటిరియల్, పుస్తకాలు ఎన్‌సీఆర్‌టీ నుంచి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారు.

ఆర్థిక ఇబ్బందులతో శిక్షణకు దూరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద,బడుగు బలహీనవర్గాల విద్యార్థులే. వారికి పది స్థాయిలో మంచి మార్కులు వచ్చినా కార్పొరేట్,ప్రైవేటు కళాశాలల్లో చదివే స్తోమత లేక ప్రభుత్వ కళాశాల్ని ఆశ్రయిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో కూడా మంచి మార్కులు సాధిస్తున్నా జాతీయ స్థాయి శిక్షణ తీసుకోలేక పోతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తరువాత ఎంసెట్, జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ , నీట్ కోసం రూ. 10వేల నుంచి రూ. 20వేల వరకు ఫాస్ట్‌ట్రాక్ శిక్షణ కోసం వెచ్చించాల్సి వస్తోంది. ఇంత మొత్తం వెచ్చించలేక పేద విద్యార్థులు ఇటువంటి శిక్షణకు దూరమౌతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఇచ్చే శిక్షణ వారికి ఎంతో ఉపయోగ పడనుంది.

పోటీ పరీక్షలకు ఎంపిక ఇలా...

ఇంటర్ చదివే విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్, జేఈఈ శిక్షణ కోసం ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఈ పరీక్ష నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ నారాయణ కళాశాల సహకారంతో శిక్షణ ఇవ్వనున్నారు. ఆ కళాశాలలు రూపొందించి మెటీరియల్‌తో పాటు అనేక మాక్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాలల్లోనే దశల వారీగా శిక్షణ ఇచ్చి



పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఇదిలా ఉంటే జాతీయస్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థుల్ని సిద్ధం చేసేందుకు అవసరమైన విధి విధానాలు ఇంకా రాలేదని, సంక్రాంతి సెలవుల తరువాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో దందా

- వీరి అనుమతి లేకుండా లారీలకు సరుకు లోడింగ్ చేయకూడదంట
- చేస్తే అడ్డుకొని తీరుతామని బెదిరింపులు
- తాజాగా నాలుగు లారీల టైర్లు గాలి తీసేసి అడ్డగింత

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో కొంతమంది లారీ యజమానులు ఒక మాఫియాగా ఏర్పడి దందా కొనసాగిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి ఎగుమతి చేయడానికి వీళ్ల నిర్ణయించిన లారీలలోనే రవాణా చేయాలని హుకూం జారీ చేస్తున్నారు. వీళ్లని కాదని ఎవరైనా లారీలు పెడితే వాటిని అడ్డుకొని దాడికి తెగబడుతున్నారు. లారీ టైర్లలో గాలి తీసేసి అడ్డగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల అండ దండలతో యథేచ్ఛగా దందా కొనసాగించారు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత అధికార పార్టీ నేత ఒకరితో ఒప్పందం చేసుకొని తిరిగి దందా కొనసాగిస్తున్నారు. తాజాగా బుధవారం సాయంత్రం చిలకలూరిపేట రోడ్డులోని వేబ్రిడ్జి వద్ద ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి లోడింగ్ చేసిన నాలుగు లారీలను అడ్డుకుని దౌర్జన్యానికి దిగారు.

మిర్చియార్డు నుంచి ఎక్కువ సరుకు ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి జరుగుతుంటుంది. అక్కడి నుంచి ఆసియా ఖండంలోని కొన్ని దేశాలకు ఎక్స్‌పోర్టు అవుతుంది. దీంతో నిత్యం పశ్చిమ బెంగాల్‌కు మిర్చి లోడింగ్‌లు జరుగుతుంటాయి. ఇదే అదనుగా కొంతమంది పలుకుబడి కలిగిన లారీ యజమానులు నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్‌ని ఏర్పాటు చేసి సిండికేట్‌గా మారారు. ఒక్కో లారీకి రూ. 1.50 లక్షల కిరాయిని వీళ్ల నిర్ణయించారు. లారీ యజమానులంతా తమ అసోసియేషన్‌లో పేరు రిజిస్టర్ చేసుకొంటే లారీలకు సీరియల్ పెడతామని చెబుతున్నారు. తమ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ లారీ పెడతానికి వీల్లేదని హుకూం జారీ చేశారు. అసోసియేషన్‌లో సీరియల్‌కు లారీని పెడితే నెలకు ఒకటి/రెండు ట్రిప్పులకంటే ఎక్కువ పడే పరిస్థితి లేదు. మరోవైపు అసోసియేషన్ నేతలు మాత్రం వాళ్ల లారీలకు ఎలాంటి సీరియల్ లేకుండా కిరాయికి పెట్టేసి రూ. లక్షలు పోగేసుకొంటున్నారు.



చిలకలూరిపేట రోడ్డులో మిర్చి లారీ యజమానుల మాఫియా అడ్డగించిన మిర్చి లారీ

ఈ వివాదం గత కొన్ని నెలల నుంచి కొనసాగుతూనే ఉన్నది. పోలీసుస్టేషన్‌కు వెళ్లినా వివాదం పరిష్కారం కాలేదు. దీంతో మళ్లీ లారీ ఓనర్స్ మాఫియా బుధవారం రెచ్చి పోయింది. అసోసియేషన్ పేరుతో ఉన్న కారులో వచ్చి ఎక్స్‌పోర్టుకు పెట్టిన లారీ యజమానిపై దౌర్జన్యానికి దిగారు. అదేమని ప్రశ్నించినందుకు లారీ టైర్లలో గాలి తీసేశారు. దీనిపై జిల్లా యంత్రాంగం, పోలీసులు స్పందించి కఠిన చర్యలు చేపట్టకపోతే శాంతిభద్రతల సమస్యకు దారి తీసే అవకాశం ఉన్నది.

ముందస్తు పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ

- పెరుగుతున్న కేసులు
- జిల్లాలో కేన్సర్ స్క్రీనింగ్‌కు రంగం సిద్ధం
- నేడు జాతీయ కేన్సర్ డే

- కొన్ని పెద్ద ఉల్లిపాయలు వలవగానే పైపొరలో లేత పసుపు రంగులో ఫంగస్ మచ్చలు కనిపిస్తాయి. వీటిని చాల మంది పట్టించుకోరు. అదే ఉల్లిపాయలను కూరల్లో వాడుతుంటారు. కేన్సర్ వ్యాధులను కలిగించడంలో ఈ పంగస్ మచ్చలు ఉన్న ఉల్లిపాయాలు అగ్రస్థానంలో ఉంటాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.
- వంట చేసేటప్పుడు మిగిలిపోయిన నూనెలను దాచి మరోసారి వాడుతుంటారు. ఇలా ఒకటి, రెండు సార్లు వినియోగించగా మిగిలిపోయిన నూనెను వంటల్లో వాడటం ఆరోగ్యరీత్యా ప్రమాదకరం. తాలింపు సమయంలో ఈ నూనెల నుంచి వెలువడే ఘాటైన వాయువులు (ఫ్యూమ్స్) ఊపిరితిత్తుల కేన్సర్‌కు కారణమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.
- నిత్యజీవితంలో చాలా మంది ప్లాస్టిక్ కవర్లలో వేడిగా ఉంటే ఆహార పదార్థాలు, టీలు, కాఫీలు తెచ్చుకొని తాగుతుంటారు. ఇది ఆరోగ్యరీత్యా మంచిది కాదు. ఆహార పదార్థాల్లో ప్లాస్టిక్ కవర్లకు ఎంతో దూరంగా ఉంటే కేన్సర్‌ను అంత దూరంగా ఉంచినట్లేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

గుంటూరు మెడికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో నానాటికి పెరుగుతున్న కేన్సర్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఏటా నవంబర్ ఏడవ తేదీన జాతీయ కేన్సర్ అవగాహన రోజుగా నిర్వహిస్తున్నారు. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2014 నుంచి దీనిని నిర్వహిస్తున్నారు. పలు రకాల కేన్సర్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నివారణ, చికిత్సల పట్ల అవగాహన కల్పించడమే ఈ రోజు ఉద్దేశం. ఏటా దేశంలో కొత్తగా 7 లక్షల కేన్సర్ కేసులు నమోదౌతున్నాయి. వీరిలో మూడు వంతుల రెండు వంతుల కేసులు వ్యాధి ముదిరిన దశలో వస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. పురుషుల్లో నోటి కేన్సర్, ఊపిరితిత్తులు, ఉదర కేన్సర్‌లు ఎక్కువగా కనిపిస్తుంటే, మహిళల్లో రొమ్ము కేన్సర్లు, గర్భాశయ ముఖద్వార, గర్భాయ, అండాశయ కేన్సర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బాధితుల్లో 60 శాతం మంది 35 నుంచి 65 ఏళ్ల వారే. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులు కేన్సర్‌కు కారణమౌతున్నాయి.

జిల్లాలో కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాన్ కమ్యూని కబుల్ డిసీజెస్ విభాగం పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా నవంబరు నెల నుంచి కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభించనున్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి ఆరోగ్య సమాచారం సేకరించనున్నారు. దీనికి సంబంధించి ప్రశ్నాపత్రాలను కూడా ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేసింది. నోటి కేన్సర్ రోగులను గుర్తించేందుకు పలు ప్రశ్నలను సంధిస్తారు. 'మీరు మసాలతో కూడిన ఘాటు ఆహార పదార్థాలు తినడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? నోటిలో తెల్లని/ఎర్రని మచ్చలు ఉన్నాయా? మానని పుండ్లు ఉన్నాయా? నోరు తెరవడంలో ఇబ్బందులు ఉన్నాయా? అనే పలు రకాల ప్రశ్నలను సంధించి వాటి సమాధానాలు రాబడతారు.

కేన్సర్ నివారణ ఇలా...

దైనందిత జీవితంలో ఆరోగ్యకరరమైన జీవనశైలి అవలంభిస్తే పలు రకాల కేన్సర్‌లను నుంచి రక్షణ లభిస్తుంది. పొగాకు ఉత్పత్తులకు పూర్తి దూరంగా ఉండాలి. మద్యపానం అలవాటు ఉన్న వారు దానిని మానుకోవాలి. ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు అధికంగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి రోజూ 30 నిమిషాల పాటు శారీరక వ్యాయామం చేయాలి. రేడియేషన్‌కు, అతి నీలలోహిత కిరణాలు శరీరం మీద పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. కుటుంబంలో ఎవరైనా కేన్సర్‌తో మరణించిన చరిత్ర ఉంటే సంబంధిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం.

బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్

మహిళల్లో రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్‌లను తొలి దశలో గుర్తించేందుకు సర్వేలో కొన్ని ప్రశ్నావళిని చేర్చారు. బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ సర్వేలో..రొమ్ములో గడ్డలు ఉన్నాయా? నిప్పిల్స్ నుంచి ద్రవాలు కారుతున్నాయా? రొమ్ము ఆకారంలో మార్పు వచ్చిందా? రుతుక్రమంలో కాకుండా ఇతర సమయాల్లో కూడా రక్తస్రావం జరుగుతుందా? వంటి ప్రశ్నలను వేస్తారు. ఇదేరీతిలో గర్భాశయ కేన్సర్, ఇతర కేన్సర్‌లకు సంబంధించిన ప్రశ్నావళిని కూడా సిబ్బందికి అందజేశారు. వాస్తవానికి ఈ సర్వేలో కేవలం కేన్సర్ వ్యాధుల స్క్రీనింగ్ నే కాకుండా వ్యక్తిగత అలవాట్లు, ఆరోగ్య పూర్తి వివరాలు, దైనందిత జీవనం, సాధారణ కుటుంబ వివరాలను కూడా సేకరిస్తారు. ఈ నెలాఖరు లోపు జిల్లాలో కేన్సర్ సర్వేను ప్రారంభించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సన్నాహాలు చేస్తోంది.



స్క్రీనింగ్ పరీక్షలతో కేన్సర్‌పై విజయం

- డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి



కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్ పరీక్షలతోనే సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ లభిస్తుందని ఆమె వివరించారు. హైరిస్క్‌లో ఉన్న వారు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. గురువారం ఉదయం పది గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అన్ని ప్రాంతాల్లో కేన్సర్ అవగాహన ర్యాలీలు నిర్వహించాలని డాక్టర్ విజయలక్ష్మీ ఆదేశం చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ర్యాలీలు జరపాలని ఆమె తెలిపారు. ఈ ర్యాలీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు.

ప్రభుత్వ భవనాలకు మోక్షం ఎప్పుడో?

- అసంపూర్తి పనులతో నిలిచిన కట్టడాలు
- ఏళ్ల తరబడి గ్రామాలలో ఇదే పరిస్థితి
- కొన్ని శిథిలావస్థకు
- నిధులు వృథా చేస్తున్నారని ప్రజల అసహనం

బల్లికురవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో విచ్చలవిడిగా గ్రామాలలో ప్రభుత్వ భవనాలకు రూ.కోట్ల నిధులను మంజూరు చేశారు. కానీ ఎక్కడా నిర్మాణాలు మాత్రం పూర్తి కాలేదు. పలు గ్రామాలలో ఏళ్ల తరబడి అలానే అసంపూర్తి పనులతో ప్రభుత్వ భవనాలు నిర్మాణం పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రజా నిధులు పెద్ద ఎత్తున వృథా అవుతున్నాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో గతంలో వైసీపీ హయాంలో పెత్తనం చేసిన కొందరు భవనాలను కొంత మేర నిర్మాణం చేపట్టి వచ్చిన వరకు బిల్లులు డ్రా చేసుకొని భవనాలను పూర్తి చేయకుండా వదిలేశారని ఇప్పుడు ఆ భవనాలను ఎవరు పూర్తి చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పట్లో అసంపూర్తి పనులతో ఉన్న భవనాల నిర్మాణాలు పూర్తయ్యే అవకాశాలు లేవని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బేసు మట్టం వేసి మట్టి బిల్లులు వచ్చే వరకు పనులు చేపట్టి నిధులను కాజేశారని అరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాలలో ఊరికి దూరంగా భవనాలను ఏర్పాటు చేయడం కూడా కొంత జాప్యం జరగడానికి కారణమని వారు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలకు గత వైసీపీ ప్రభుత్వం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలకు నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో గత మూడేళ్ల కాలం నుంచి గ్రామాలలో భవనాల నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక్కో సచివాలయ భవనానాకి రూ.43లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.24లక్షలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ.20లక్షల చొప్పున నిధులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో వైసీపీ చోటా నేతలు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భవనాలను నిర్మాణం చేపట్టారు. కొందరు బేసు మట్టం వేసి మట్టి బిల్లులు పొంది తదుపరి పనులను నిలిపివేవారు. కొందరు కప్పు వరకు వేసి అలానే వదిలి వేశారు. కొందరు పిల్లర్ల దశ వరకు పనులు చేపట్టి అర్కుడకు వచ్చిన వరకు బిల్లులను పొంది పను లు పూర్తి చేయకుండా వదిలి వేశారు. ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనాల నిధులు పక్క దారి పట్టాయని పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నిసార్లు భవనాల అసంపూర్తి పనులు పూర్తి చేయాలని అధికారులు పనులు మెదలు పెట్టినా, వారితో చెప్పినా ఎవరు పట్టించుకోక పోవడం వలనే అన్ని గ్రామాలలో భవన నిర్మాణాలు పూర్తి కాకుండా ఉన్నాయి. బల్లికురవ మండలంలోని కొత్తూరులో రైతు భరోసా కేంద్రం, పిల్లర్ల దశలోనే ఉంది. అలానే ముక్తేశ్వరం అర్‌బీకే భవనం పిల్లర్ల దశలోనే శిథిలావస్థకు చేరింది. విలేజ్ హెల్త్ భవనం ప్లాస్టింగ్ వరకు వచ్చి ఉంది. వెలమవారిపాలెంలో సచివాలయం భవనం 80 శాతం పూర్తి కాగా ఆర్‌బీకే భవనం పిల్లర్ల దశలోనే ఉంది. కూకట్లపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు కప్పు దశలోనే ఉన్నాయి. కొణిదెనలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు 70శాతం పనులు పూర్తయి ఉన్నాయి. సోమవరప్పాడులో ఆర్‌బీకే స్లాబు వరకు రాగా విలేజ్ హెల్త్ క్లినిక్ పిల్లర్ల దశలోనే ఉంది. వల్లాపల్లిలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం స్లాబు పూర్తి అయి ఉంది. చెన్నుపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు 80 శాతం పూర్తయి పనులు నిలిచి ఉన్నాయి. ఎస్ఎల్ గుడిపాడులో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు పిల్లర్ల దశలోనే పనులు నిలిచి ఉన్నాయి. బల్లికురవలో కోర్టు కేసులతో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు బేసు మట్టం దశలో పనులు నిలిచి ఉన్నాయి. అలానే మరి కొన్ని గ్రామాలలో అరకొర పనులు పూర్తి కాక పోవడంతో ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రభుత్వ భవనాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా అసంపూర్తి భవనాలపై దృష్టి పెట్టలేదని వెంటనే అన్ని గ్రామాలలో పనులు నిలిచి ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కొమ్మినేనివారిపాలెంలో అసంపూర్తిగా పనులు పూర్తి కాని విలేజీ హెల్త్ క్లినిక్ భవనం


కొమ్మినేనివారిపాలెంలో కప్పు వేసి వదిలేసిన రైతు సేవా కేంద్రం


ముక్తేశ్వరంలో పిల్లర్ల దశలోనే నిలిచిన రైతు సేవా కేంద్రం


కొత్తూరులో పిల్లర్ల దశలోనే ఉన్న రైతు సేవా కేంద్రం

హత్యాయత్నం కేసులో ఆరుగురికి శిక్ష

- వారిలో నలుగురికి ఐదేళ్లు, ఇద్దరికి రెండేళ్ల జైలు, జరిమానా

చీరాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో 2017 సంవత్సరంలో వ్యక్తిపై కత్తులతో, ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడి హత్యాయత్నానికి ప్రయత్నించిన వారిలో ఆరుగురికి శిక్ష పడింది. వీరిలో నలుగురికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా, మరో ఇద్దరికి ఏడాది సాధారణ జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ చీరాల అసిస్టెంట్ స్టేషన్స్ కోర్టు న్యాయాధికారి సుధ తీర్పును వెల్లడించారు. స్థానిక థామస్‌పేటకు చెందిన బొనిగల శ్యామ్‌బాబు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ముంతావారి సెంటర్‌లో వెనుక నుంచి వెంబడించిన జాన్‌పేటకు చెందిన జొన్నలగడ్డ ప్రభుదాస్, అశోక్ కుమార్, ఉప్పురమేష్, శ్రీనివాసనగర్‌కు చెందిన సాతినేని శివపార్వతి, దేవిశెట్టి మస్తాన్‌రావు, కొండెపి మండలం పెట్లూరు గ్రామానికి చెందిన అరతోటి ప్రసాద్ కత్తులతో, ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈక్రమంలో అప్పటి సీఐ సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. అయితే కేసు ప్రస్తుతం విచారణకు రావడంతో ప్రస్తుత సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సాక్షాదారులను కోర్టులో హాజరు పరచగా, పీపీ పద్మజ వాదనలు వినిపించారు. దీంతో బుధవారం తీర్పు వెలువడింది. నేరస్తులకు ఎప్పటికైనా శిక్షలు తప్పవని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

రైతును ఢీకొట్టిన వ్యాన్

ఘటనా స్థలంవద్దే మృతి

బల్లికురవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పొలం పనులకు వెళుతున్న రైతు పావులూరి హరిబాబు (60)ని వెనుక నుంచి మినీ వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం బల్లికురవలో జరిగింది. బల్లికురవ గ్రామానికి చెందిన రైతు పావులూరి హరిబాబు పొలం పనులకై చెన్నుపల్లి రోడ్డు వైపు వెళ్లి రోడ్డు దాటుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన మినీ వ్యాన్ ఢీకొట్టింది. రైతు మృతదేహాన్ని వ్యాన్ కొంత దూరం ఈడ్చుకు రావడంతో ఛిద్రమైంది. వినుకొండ నుంచి బల్లికురవ గొర్రెలను దించేందుకు వచ్చి తిరిగి వెళుతున్న ఈ వ్యాన్ వేగంగా రావడం వలనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగి పోయారు. ఎస్ఐ జీవీ చౌదరి పరిశీలించి ప్రమాద వివరాలను సేకరించారు. హరిబాబు భార్య పద్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హరిబాబుకు కుమారుడు ఉన్నాడు.

ఇం'ధనం' లేక నిలిపివేత

- కదలని 108లు
- జిల్లావ్యాప్తంగా నిలిచిన 10 వాహనాలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాణపాయ పరిస్థితులలో ఆపద్బాంధవుల్లా ఆదుకుంటున్న 108 వాహనాలు మూగపోతున్నాయి. నిత్యం ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా సత్వరమే చేరుకునే వాహనాలకు ఇంధనం (డీజిల్) లేని పరిస్థితి నెలకొంది. ఆ వాహనాలకు అవసరమైన మేరకు డీజిల్ లేకపోవడంతో ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయోనని పైలెట్లు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా 108కు డీజిల్ ఫుల్‌ట్యాంకు చేయించుకొని అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం జరిగినట్లు ఫోన్ వచ్చిందంటే ఏ సమయంలోనైనా సరే వెంటనే అక్కడకు ఆగమేఘాలపై వెళ్లాలి. అటువంటి వాహనాలకు తాజాగా నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా అరవిందో సంస్థ 108 వాహనాల నిర్వహణకు కాంట్రాక్టు అప్పగించింది. ప్రస్తుతం కూడా ఆ సంస్థనే చూస్తోంది. అందులో భాగంగా ప్రకాశం జిల్లాలో 40 వాహనాలు నడుస్తున్నాయి. వాటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆ సంస్థపై ఉంటుంది.

పది వాహనాలు ఆగాయి

అయితే బుధవారం జిల్లాలో 10 వాహనాలు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలుతోపాటు కురిచేడు, పలు ఇతర మండలాల్లో వాహనాలు ఆగిపోయాయి. కేవలం 30 వాహనాలు మాత్రమే రన్నింగ్‌లో ఉండగా వాటిలోనూ డీజిల్ అయిపోతే అవి పక్కనపెట్టే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదనే కారణంతో 108 వాహనాలకు అవసరమైన డీజిల్, ఇతర మెయిటినెన్స్‌కు సంస్థ డబ్బులు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ఒక రోజు ఒక ప్రాంత వాహనాలకు డీజిల్ కొట్టించి నడుపుతున్నట్లు సమాచారం.

డిజిల్ వినియోగంపై సంస్థ ఆంక్షలు

సంస్థ రోజువారీ డీజిల్ కోసం ఎంతో కొంత నగదును ఇస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్క రోజు 108 వాహనం ఎక్కువ తిరిగాల్సి రావడంతో ఆ డీజిల్ ఒక్క రోజుకే సరిపోతుంది. సాధారణంగా రోజువారీ కాకుండా ఆ వాహనానికి ఉన్న ట్యాంకును ఫుల్ చేయించుకుంటుంటారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రోజువారీ ఒక్కొక్క వాహనానికి ఐదారు వందలకు మాత్రమే డీజిల్ కొట్టిస్తున్నట్లు సమాచారం. ఆ వినియోగంపై కూడా ఆంక్షలు పెడుతుండటంతో డ్రైవర్లు(పైలెట్) ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గతంలో డీజిల్ బంకుల్లో ఆ వాహనాలకు అప్పునకు పోసేవారు. నెలవారీ బిల్లులు చెల్లింపు చేసేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ఏ రోజుకారోజు పోయించుకోవాల్సి రావడంతో వాహనాలు ఎప్పుడు నిలిచిపోతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

భారీ నష్టం

- 5020.96 హెక్టార్లు, 7,468 మంది రైతులు
- గత నెలలో వర్షాలకు దెబ్బతిన్న పంటల లెక్కతేల్చిన అధికారులు
- రూ.7.12 కోట్లు పరిహారం కోరుతూ

ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక

ఒంగోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టాలపై అధికారులు లెక్కతేల్చారు. వ్యవసాయశాఖ పరిధిలో మొత్తం ఆరు రకాల పంటలు 5,020.96 హెక్టార్లలో దెబ్బతిన్నాయని, 7,468మంది రైతులు నష్టపోయినట్లు నిర్ధారించారు. గతనెల 10 నుంచి 20తేదీ వరకు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసిన విషయం విదితమే. అత్యధిక ప్రాంతాల్లో భారీవర్షాలు పడగా చాలా మండలాల్లో 15 నుంచి 23 సెం.మీ వర్షపాతం ఆ సమయంలో నమోదైంది. అలా తెరపి లేకుండా వర్షాలు కురవడంతో పంటలకు అపారనష్టం జరుగుతుందని అందరూ భావించారు. అయితే వర్షాలు కురిసే సమయానికి ఖరీఫ్ పంటలు అధికశాతం పూత, కాయదశలో ఉన్నాయి. అయితే కోతకు వచ్చిన సజ్జపంట అలాగే కాయలు కుళ్లి కొంత మేర పత్తి పంటకు నష్టం జరిగింది. ఇదిలా ఉండగా వర్షాలు కురిసే సమయానికి మినుము, అలసంద, కంది ఇతర త్రా పంటలు వేసి నెల, నెలన్నర లోపుగా అధిక ప్రాంతాల్లో ఉన్నాయి. అలా మొక్క లేదా మొలకదశలో ఉన్న ఆ పంటలకు కూడా కొంత నష్టం జరిగినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూత దశ నుంచి జరిగే నష్టాన్నే పరిగణనలోకి తీసుకుంటారు. అలా గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం కొంత పరిమితంగానే తేలింది.

రూ.7.12 కోట్లు పరిహారం ఇవ్వాలి

గతనెల 27 వరకు రైతు వారీ, పంట వారీ నష్టాలను వ్యవసాయ, రెవెన్యూ క్షేత్ర స్థాయి అధికారులు సర్వే చేసి గుర్తించారు. ఈనెల 2 వరకు రైతు సేవా కేంద్రాలలో ఆ జాబితాలను ఉంచారు. పెద్దగా అభ్యంతరాలు, ఫిర్యాదులు వచ్చిన దాఖాలాలు లేకపోగా వ్యవసాయ అధికారులు మూడు రోజుల క్రితం పంటల వారీ, రైతువారీ నష్టాలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం వివరాలను కలెక్టర్‌కు అందజేశారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా భారీవర్షాలతో 7,468 మంది రైతులకు చెందిన 5,020.96 హెక్టార్లలోని ఆరు రకాల పంటలకు నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించారు. సంబంధిత రైతులకు పరిహారంగా రూ.7.12కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని ఆ నివేదికలో పేర్కొన్నారు. కాగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం నిధులు విడుదల చేసినప్పుడు నేరుగా వారివారి ఖాతాల్లో ఆ మొత్తాలు జమ అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. పంట నష్ట వివరాలు ఇలాఉన్నాయి

పంట పేరు	దెబ్బతిన్న విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు	అంచనా (రూ.లక్షల్లో)
వరి	7.20	10	1.22
సజ్జ	1583.47	2558	135.44
జొన్న	3.18	3	0.27
పొగాకు	58.51	48	5.80
పత్తి	3338.49	4825	567.54
కొర్ర	20.20	24	1.72
మొత్తం	5020.96	7468	712.04(లక్షలు)

సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

- పరిధిని పునరుద్ధరించిన ప్రభుత్వం
- 8,352.69 చదరపు కిలో మీటర్లకు చేరిన విస్తీర్ణం
- గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ మంత్రివర్గం తీర్మానం
- నిర్ణయంపై పల్నాడు, బాపట్ల జిల్లావాసుల హర్షం

బాపట్ల, నరసరావుపేట, గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈదులపా లెం, నడింపాలెం, ప్రత్తిపాడు, మల్లాయపా లెం, గొట్టిపాడు, కొండ జాగర్లమూడి, గనికెపూడి, పెద నందిపాడులో గొరిజవోలు గుం ట పాలెం, యడ్లపాడు మండలంలోని మర్రిపాలెం, ఉన్నవ, కొండవీడు, సొలస, వంకాయలపాడు, మైదవోలు, యడ్లపాడు, విశ్వనాధుని కండ్రిక, జాలాది, తిమ్మాపురం, కారుచోల, నాదెండ్ల మండలంలోని నాదెం డ్ల, ఫిరంగిపురం మండలంలోని హవుసు గణేష, రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్, నుదురుపాడు, వేమవరం, బేతపూడి, తాళ్లూరు, యర్రగుంట్లపాడు, సిరంగిపా లెం, తక్కెళ్లపాడు, ముప్పాళ్ల మండలంలోని మాదల, సత్తెనపల్లి మండలంలోని పెద మక్కెన, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు, నందిగామ, కంటెపూడి, భీమవరం, కంకణాలపల్లె, గుడిపూడి, ఫణిదం, అబ్బూరు, పాకాలపాడు, రెంటపాళ్ల, గోరంట్ల, కట్టమూరు, భట్లూరు, వడ్డవల్లి, పెదకూరపాడు మండలంలోని అన్ని గ్రామాలు, అచ్చంపేట మండలంలోని కస్తల అగ్రహారం, కోనూరు, ఓర్వకల్లు, అంబడిపూడి, వేల్పూరు, చిగురుపాడు, మిట్టపాలెం, పెదపాలెం, చామర్రు, అచ్చంపేట, నీలేశ్వరపాలెం, తాళ్లచెరువు, చింతపల్లి, కోగంటివారిపాలెం, క్రోసూరు మండలంలోని అనంతవరం అగ్రహారం, క్రోసూరు, విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం, పారుపల్లి, పీసపాడు, అందుకూరు, బాలెమర్రు, ఉయ్యందన గ్రామాలు ఏపీసీఆర్‌డీఏలోకి వచ్చాయి.

సీఆర్‌డీఏ ప్రస్థానం..

2014లో ఏపీసీఆర్‌డీఏ ఏర్పడింది. గుంటూరు, ఏలూరు, ఎన్‌టీఆర్, కృష్ణ, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామాలు, పట్టణాలతో దీని కూర్పు జరిగింది. అంతకుముందు ఉన్న వీజీటీఎం ఉడాని రద్దు చేసి పరిధిని పెంచి సీఆర్‌డీఏని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో జోన్లను కూడా ఏర్పరిచింది. అవుటర్ రింగురోడ్డుని కూడా ఎలైన్‌మెంట్ చేసి నిర్మాణం చేపట్టే సమయంలో ఎన్నికలు జరిగి 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే జీఎన్ రావు కమిటీ అని ఏర్పాటు చేసి మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అందుకు అనుగుణంగా 2020లో ఏపీసీఆర్‌డీఏ బిల్లుని రద్దు చేసింది. దీనిపై అమరావతి రాజధాని పరిరక్షణ సమితి రైతులు ఉద్యమించారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో కేసులు వేసి పోరాడారు. ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు స్టే విధించింది. అంతేకాకుండా ఏపీసీఆర్‌డీఏ చట్టం రద్దు చెల్లదని తీర్పు ఇచ్చింది. దాంతో వైసీపీ ప్రభుత్వం 2021లో సీఆర్‌డీఏ చట్టాన్ని పునరుద్ధరించింది. అయితే అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టకపోగా మరోవైపు సుప్రీం కోర్టులో రివిజన్ పిటీషన్ దాఖలు చేసింది.

ఆ మండలాలకు మహర్దశే

కూటమి ప్రభుత్వంలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతుండడంతో పాటు కేంద్రం నుంచి నిధులు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీంతో రాజధాని ప్రాంతంలో వివిధ పనులు చకాచకా జరుగుతున్న సంగతి తెలిసిందే. సీఆర్‌డీఏ పరిధిలో పలు ప్రాజెక్టులు భవిష్యత్తులో క్యూ కట్టనున్నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పలు గ్రామాలు సీఆర్‌డీఏలోకి వెళ్లాయి. దీంతో ఆయా గ్రామాల్లో కూడా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అక్కడి ప్రజలు భావిస్తూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది

వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలను తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనందాన్ని ఇచ్చింది. గత ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం కక్షసాధింపే అజెండాగా తీసుకున్న తలాతోక లేని నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఆ చీకటి నిర్ణయాలను సరిదిద్దే దిశగానే తిరిగి సీఆర్‌డీఏ పరిధిని కూటమి ప్రభుత్వం విస్తరించింది.

\- నక్కా ఆనంద్‌బాబు, వేమూరు ఎమ్మెల్యే

తగ్గిన పూడా పరిధి

పల్నాడు జిల్లాలోని ఆరు మండలాలు, సత్తెనపల్లి మున్సిపాల్టీని సీఆర్‌డీఏలో విలీనం చేస్తూ క్యాబినెట్‌లో తీర్మానంతో పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అథార్టీ(పూడా) పరిధిని తగ్గింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాలతో పూడాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 22 మండలాలకు పూడా పరిధిని కుదించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, యడ్లపాడు మండలాలను పూడా నుంచి తొలగించి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకున్నారు. దీంతో పూడా రూపురేఖలు మారిపోయాయి. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలు, గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకే పూడాకు పరిమితమైంది.

దశ, దిశలేని బావుడా

కేవలం ఓ నామినేటెడ్ పోస్టు సృష్టించడం కోసమే ఆదరాబాదరాగా గత వైసీపీ ప్రభుత్వం బావుడా ఏర్పాటు చేసిందనే విమర్శలున్నాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు, కాకుమాను మండలాలను కూడా బావుడా పరిధిలోకి తెచ్చింది. చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ఒంగోలు కేంద్రంగా ఉన్న ఉడా పరిధిలో ఉన్నాయి. దీంతో జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో మూడు అటు, మూడు ఇటు ఉన్నాయి. ఇక సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న వేమూరు నియోజకవర్గాన్ని తీసుకొచ్చి బావుడాలో అయితే విలీనం చేసింది తప్ప అభివృద్ధి విషయంలో ఓ దశ, దిశ చూపడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తమ ప్రాంతం సీఆర్‌డీఏలోకి వెళ్లగా అభివృద్ధిపై గంపెడాశలతో ఉండగా వారి ఆశలను కాలరాస్తు వైసీపీ ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందనేది అక్కడి ప్రజల అభిప్రాయం.


జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించిన డీవైఈవో రవీంద్ర భారతి, నిర్వాహకులు

రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్ విజేతలు

ఉంగుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో బుధవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-14, 17 అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. తాడేపల్లిగూడెం డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి పోటీలను ప్రారంభించారు. విజేతల వివరాలను పోటీల పరిశీలకుడు ప్రసాద రెడ్డి, ఆర్గనైజర్, హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు ప్రకటించారు. బాలికల విభాగం హైజంప్‌లో విశాఖ జిల్లాకు చెందిన బి.ఇషానా ప్రథమ స్థానం పొందగా భావన (తూర్పుగోదావరి) ద్వితీయస్థానం, కే.లక్ష్మీ ప్రియ (చిత్తూరు) తృతీయస్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో జి.కొండలలక్ష్మీ (తూర్పు గోదావరి) ప్రథమ, ఎం.రిషిత (కర్నూల్) ద్వితీయ, పి.మానస (శ్రీకాకుళం) తృతీయస్థానం పొందారు. షాట్‌పుట్‌లో ఎం.కరిష్మా (గుంటూరు)ప్రథమ, పి, రితిక (నెల్లూరు) ద్వితీయ, డి.లాస్య (చిత్తూరు) తృతీయ స్థానం పొందారు.బాలురు అండర్-14 విభాగం హైజంప్‌లో వి.రాఘవేంద్ర (విజయనగరం)ప్రథమ డి.రహీం (ప్రకాశం) ద్వితీయ, కే.రాఘవేంద్ర(వైస్సార్ కడప) తృతీయ స్థానం పొందారు. లాంగ్ జంప్‌లో ఎం.పెంచల్ బాబు (కడప) ప్రథమ, పి.రాజేష్ (విశాఖపట్నం) ద్వితీయ, డి.వెంకటేశ్ (ప్రకాశం) తృతీయ స్థానం పొందారు. షాట్‌పుట్‌లో జి.చంద్రశేఖర నాయుడు (విశాఖపట్నం)ప్రథమ, బి.భరత్ చంద్ర (శ్రీకాకుళం) ద్వితీయ, వి.గణేష్ (శ్రీకాకుళం)తృతీయ స్థానం సాధించారు. డిస్క్‌త్రోలో జి.చంద్రశేఖర నాయుడు (విశాఖ) ప్రథమ బి.వెంకటేష్ (కర్నూలు)ద్వితీయ, టి.విన్సెంట్ (ప్రకాశం) తృతీయ స్థానం పొందారు.

డీసీసీబీలో విచారణ ప్రారంభం

- పలు ఫైళ్లు పరిశీలించిన కలెక్టర్
- నియమించిన త్రిసభ్య కమిటీ
- రాఘవయ్యకు ఇన్‌చార్జీ సీఈవోగా బాధ్యతలు

ఒంగోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో అవినీతి, అక్రమాలపై ప్రాథమిక విచారణ ప్రారంభమైంది. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇందుకోసం నియమించిన ముగ్గురు అధికారుల కమిటీ బుధవారం సాయంత్రం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. బ్యాంకులో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వ స్థాయిలో కదలిక వచ్చిన నేపథ్యంలో ప్రాథమికంగా ముగ్గురు సభ్యుల కమిటీ విచారణ ప్రారంభించింది. బ్యాంకులో విచారణ సజావుగా సాగేందుకు సీఈవో కోటిరెడ్డిని బాధ్యతల నుంచి తప్పించారు. అలాగే అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ కోసం సెక్షన్ 51 విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరిన నేపథ్యంలో కొంత ఆలస్యంగా అయినా తదనుగుణ చర్యలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటివరకు సీఈవోగా ఉన్న కోటిరెడ్డి మంగళవారం రాత్రి ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రాజీనామా లేఖను బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ గోపాలకృష్ణకు అందజేశారు. దీంతో ప్రస్తుతం బ్యాంకు జనరల్ మేనేజర్ (జీఎం)గా ఉన్న కుంభా రాఘవయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ముగ్గురు అధికారులతో విచారణ

మరోవైపు కలెక్టర్ తన లేఖలో కోరిన సెక్షన్ 51 విచారణవైపు ప్రభుత్వం మొగ్గుచూపినట్లు సమాచారం. అందుకు వీలుగా ఉన్నతాధికారులు ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కోరారు. సాధారణంగా అలాంటి నివేదికు జిల్లా సహకారశాఖ అధికారులు ఇస్తారు. అయితే బ్యాంకు సంబంధించిన వ్యవహారంలో ఇక్కడి సహకారశాఖ అధికారులు తనను తప్పుదోవ పట్టించారన్న ఆగ్రహంతో కలెక్టర్ ఉన్నారు. మరోసారి ప్రాథమిక విచారణ బాధ్యతను వారికి ఇస్తే ప్రమాదంగా భావించి ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించారు. రెవెన్యూలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారైన లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్(ఎల్‌డీఎం) సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు.

ఫైళ్లను పరిశీలించిన కమిటీ

ప్రభుత్వానికి గతంలో అందిన ఫిర్యాదులతోపాటు తాజాగా మరికొన్ని ఆర్థికపరమైన అవకతవకలు కూడా కలెక్టర్ దృష్టికి రావడంతో వాటన్నింటిని పరిశీలించాలని సూచించారు. తదనుగుణంగా లోకేశ్వరరావు నేతృత్వంలోని ముగ్గురు కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం డీసీసీబీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి పలు ఫైళ్లను పరిశీలించారు. ఇదిలా ఉండగా పర్సన్ ఇన్‌చార్జీ అయిన జేసీ గోపాలకృష్ణ బుధవారం మధ్యాహ్నం బ్యాంకుకు వెళ్లి ఒకరిద్దరు కీలక అధికారులను పిలిచి గతంలో బ్యాంకులో జరిగిన బంగారు రుణాల అక్రమాలు, అప్పట్లో జరిగిన అవకతవకలు, విచారణలు, తదనంతర చర్యలు ఇతరత్రా అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు

- వచ్చే ఏడాది నుంచి మండలానికో జూనియర్ కళాశాల
- భారీ అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక
- ఇంటర్ కళాశాలల్లో ఎంసెట్, జేఈఈఈ, నీట్ పరీక్షలకు శిక్షణ
- ఈ ఏడాది ఇప్పటికే ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు పంపిణీ

వృత్తి విద్యాకళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సులో శిక్షణ ఇచ్చి ఎంసెట్, జేఈఈ , నీట్ పరీక్షలకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటిరియల్, పుస్తకాలు ఎన్‌సీఆర్‌టీ నుంచి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారు.

ఆర్థిక ఇబ్బందులతో శిక్షణకు దూరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద,బడుగు బలహీనవర్గాల విద్యార్థులే. వారికి పది స్థాయిలో మంచి మార్కులు వచ్చినా కార్పొరేట్,ప్రైవేటు కళాశాలల్లో చదివే స్తోమత లేక ప్రభుత్వ కళాశాల్ని ఆశ్రయిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో కూడా మంచి మార్కులు సాధిస్తున్నా జాతీయ స్థాయి శిక్షణ తీసుకోలేక పోతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తరువాత ఎంసెట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ , నీట్ కోసం రూ. 10వేల నుంచి రూ. 20వేల వరకు ఫాస్ట్‌ట్రాక్ శిక్షణ కోసం వెచ్చించాల్సి వస్తోంది. ఇంత మొత్తం వెచ్చించలేక పేద విద్యార్థులు ఇటువంటి శిక్షణకు దూరమౌతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఇచ్చే శిక్షణ వారికి ఎంతో ఉపయోగ పడనుంది.

పోటీ పరీక్షలకు ఎంపిక ఇలా...

ఇంటర్ చదివే విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్, జేఈఈ శిక్షణ కోసం ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఈ పరీక్ష నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ నారాయణ కళాశాల సహకారంతో శిక్షణ ఇవ్వనున్నారు. ఆ కళాశాలలు రూపొందించి మెటీరియల్‌తో పాటు అనేక మాక్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాలల్లోనే దశల వారీగా శిక్షణ ఇచ్చి పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఇదిలా ఉంటే జాతీయస్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థుల్ని సిద్ధం చేసేందుకు అవసరమైన విధి విధానాలు ఇంకా రాలేదని, సంక్రాంతి సెలవుల తరువాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

8 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు విద్య, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర శిక్ష ద్వారా నిర్వహిస్తున్న 38 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి సంబంధించి ప్రాథమిక మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలు డీఈవో కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయం నోటీసు బోర్డుల్లో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆర్డీవో తనిఖీ

ఇంకొల్లు, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం కొణికి రోడ్డులోని భూమిని పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిలిచిన పారిశుధ్య పనులు

» ఎక్కడి చెత్త అక్కడే

ఇంకొల్లు, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికులు రెండ్రోజులుగా విధులను నిలిపివేశారు. నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడం తో పనులు నిలిపివేసినట్లు వారు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే అందజేయాలని అధికారులకు విన్నవించినట్లు చెప్పారు. పారిశుధ్య పనులు లేకపోవడంతో వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే కన్పిస్తోంది. అధికారులు స్పందించి సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏవోగా రామ్మోహన్ రెడ్డి

పర్చూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయాధికారిగా ఎస్.రామ్మోహన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎండీఏ ఎస్.మోహనరావు తెలిపారు. గత ఏడాది ఎన్ఎఫ్ఎస్ఎం (జాతీయ ఆహార భద్రతా మిషన్) కింద సబ్సిడీ శనగల నిధులు దుర్వినియోగం అయిన నేపథ్యంలో ఏవోను బాధ్యులను చేస్తూ అధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు. తిరిగి ఆ నిధులను ఏవో చెల్లించిన నేపథ్యంలో పర్చూరు ఏవోగా కమిషనర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నియమించినట్లు ఏడీఏ తెలిపారు.

దొంగలు బాబోయ్.. దొంగలు

» గ్రామాల్లో వ్యవసాయ మోటార్‌లు, పట్టణాల్లో ఇళ్లల్లో చోరీలు
» తాళం వేసి ఉంటే అంతే
» ఇంట్లో మనుషులున్నా డోంట్ కేర్
» ఆర్టీసీ బస్టాండ్‌నూ వదలని వైనం
» గస్తీపై దృష్టి సారించని పోలీసులు

అద్దంకి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు ఇటీవల వరకు విన్న మాట... ఇప్పుడు అలా కాదు... ఇంటి లోపల తలుపు వేసుకొని నిద్రిస్తున్నా దొంగలు డోంట్ కేర్ అన్న విధంగా వ్యవహరిస్తూ చోరీలకు పాల్పడుతుండడం ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఇటీవల అద్దంకి ప్రాంతంలో దొంగతనాలు బాగా పెరిగాయి. పట్టణంలో తరచూ చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఇక చోరీకి యత్నాలు అయితే మరింత ఎక్కువగా జరుగుతున్నాయి. ఐదారు నెలల కిందట అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీ రోడ్డులో ఓ బ్యాంక్ ఉద్యోగి కుటుంబం ఊరికి వెళ్లింది. యువకుడు ఒక్కడే వచ్చి చోరీకి పాల్పడ్డాడు. పెద్ద మొత్తంలో బంగారం అపహరణకు గురైంది. దొంగతనానికి వచ్చిన యువకుడి కదలికలు మొత్తం సమీపంలో ఉన్న పలు సీసీ కెమెరాలలో క్లియర్‌గా నమోదైంది. అయితే ఇంత వరకు అతీగతీ లేదు. సదరు బ్యాంక్ ఉద్యోగి కలవని ప్రజా ప్రతినిధి, పోలీస్ అధికారి లేరు. అయితే ఇంత వరకు దొంగ దొరకలేదు. ఆ తరువాత పట్టణం నడిబొడ్డున మున్సిపల్ కార్యాలయం సమీపంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇక కాకానిపాలెంలో రెండు ఇళ్లల్లో చోరీ జరగ్గా దొంగలు దొరికారు. నెలరోజుల కిందట ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల వెనుక వైపు 6 ఇళ్లల్లో నిద్రిస్తుండగానే చోరీకి ప్రయత్నాలు జరిగాయి. శ్రీనగర్, సాయినగర్‌లలో కూడా రెండు నెలల కిందట దొంగనాలు జరిగాయి. ఎల్ఈఎఫ్ నగర్‌లో తాళ్లూరు ఎంఈవో సుబ్బయ్య దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగానే చోరీ జరిగింది. ఇక వేలమూరిపాడు రోడ్డులో ఆంజనేయస్వామి దేవాలయం హుండీ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. అదే ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలో బంగారం గొలుసును మోటార్‌సైకిల్‌పై వచ్చిన యువకుడు లాక్కొని వెళ్లాడు. ఇది మరవకముందే ఆర్టీసీ బస్టాండ్ బస్సు ఎక్కే మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో బంగారం గొలుసును అపహరించారు. బస్టాండ్‌లో గతంలో పలు సార్లు చోరీలు జరిగాయి. బ్యాంక్‌ల నుంచి రైతులు నగదు డ్రా చేసి తీసుకు వెళ్లడాన్ని గుర్తించి అగంతకులు చోరీలకు పాల్పడుతున్నారు. ఇక గ్రామాలలోని పొలాలలో వ్యవసాయ మోటార్‌ల కేబుల్ వైర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి కాపర్ వైరు అపహరణ తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఇక వెలుగులోకి రాని చిల్లర దొంగతనాలు ఎన్నో చెప్పలేం. ఒక వైపు దొంగతనాలను అరికట్టాల్సి ఉండగా, చోరీ సొత్తు రికవరీ కూడా పోలీస్‌లకు సవాల్‌గా మారింది. గతంలో కూడా ఇదే తరహావి జరగగా పగలు, రాత్రి సమయాలలో గస్తీ పెంచడం, బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా వంటి చర్యలతో కొంత మేర తగ్గాయి. అయితే మరలా పోలీస్ నిఘా తగ్గడంతో దొంగలు మరింత రెచ్చి పోతున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి రాత్రి సమయాలలో గస్తీ పెంచాలని, అదే సమయంలో పగలు సమయంలో బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద పోలీసులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సొత్తు రికవరీపై కూడా ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని బాధితులు అభిప్రాయపడుతున్నారు.



అద్దంకిలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో చోరీ జరిగిన బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో చెల్లాచెదరుగా ఉన్న వస్తువులు (ఫైల్)



ఎల్ఈఎఫ్ నగర్‌లో ఎంఈవో సుబ్బయ్య ఇంట్లో తెరిచి ఉన్న బీరువా (ఫైల్)



భద్రతావారోత్సవాలలో పాల్గొన్న తనిఖీ టీం, కార్మికులు

భద్రత పాటించే క్వారీలకు గుర్తింపు

బల్లికురవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్వారీలలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తనిఖీ బృందాల కన్వీనర్ సత్యసుధీర్, శివనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని వీర్ల కొండ వద్ద శ్రీశ్రీనివాస, సత్యకృష్ణ, లక్ష్మీ, నరసింహారావు గ్రానైట్ క్వారీలలో భద్రత వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా తనిఖీ బృందాలు క్వారీలలో పనులు చేస్తున్న కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రతి ఏటా భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్న క్వారీలకు బహుమతులను అందజేస్తారని వారు తెలిపారు. కార్మికులు పని చేసే ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో క్వారీల మేనేజర్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రాయితీ శనగ విత్తనాల పంపిణీ



సబ్సిడీ శనగ విత్తన పంపిణీ చేస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : : సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ ప్రారంభించినట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. రబీలో సాగుచేసే శనగకు 25 శాతం సబ్సిడీపై విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు. జేజే రకం క్వింటా పూర్తి ఖరీదు రూ-9400, కాగా సబ్సిడీ పోను రూ.7050కు, కాక్-2 రకం రూ.12100, సబ్సిడీపోను రూ.9075 ఇస్తున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్‌ను అందజేసి రైతులు విత్తనాలను పొందవచ్చని తెలిపారు. కోటపాడు రైతు సేవా కేంద్రంలో బుధవారం సబ్సిడీ శనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఏవో ప్రారంభించారు.

బల్లికురవ : రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై శనగ విత్తనాలను అందజేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి కుమారి తెలిపారు. బుధవారం మండలంలోని కొణిదెన, రాజుపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. 25 శాతం సబ్సిడీపై జేజీ 11 రకం శనగ విత్తనాలను సబ్సిడీ పోను రైతులకు క్వింటా రూ.7050కి, కాక్ 2 రూ.9075కి వస్తుందన్నారు. అవసరమైనవారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వంశీ, మార్కెటింగ్ ప్రతినిధి సురేష్, ఎంపీఈవో గుణశేఖర్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు రగ్గుల పంపిణీ



వృద్ధులకు రగ్గులను అందజేస్తున్న చెంచులక్ష్మి

పంగులూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో నూర్‌బాషాల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు రగ్గుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని క్విజ్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు నిడమానూరి నాగేశ్వరరావు సతీమణి చెంచులక్ష్మి, ఆమె సోదరుడు జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచుప్రసాద్, శేషకుమారి దంపతులతో కలసి బుధవారం పంగులూరుకు చెందిన 57 మంది నూర్‌బాషా మహిళలకు 30 వేల విలువ చేసే రగ్గులను పంపిణీ చేశారు. పంగులూరులోని వారి నివాస గృహంలో జరిగిన కార్యక్రమంలో నూర్‌బాషా ప్రతినిధులు నందవరపు రామాంజనేయులు, వీరాంజనేయులు, పోతుగంటి అజీషా, పీర్‌సాహెబ్, నూర్‌బాషా మహిళలు పాల్గొన్నారు

యుద్ధప్రాతిపదికన సిమెంట్ స్తంభాల ఏర్పాటు

పర్చూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వందల మంది ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో హైటెన్షన్ విద్యుత్ వైర్లతో ఉన్న ఇనుప కరంట్ పోల్ కూలేందుకు సిద్ధం ఉంది. దీనికి తోడు వైర్లు సైతం వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో వార్త వెలువడింది. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఏడీఈ రమేష్, ఏఈ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం యుద్ధప్రాతిపతికన దెబ్బతిన్న ఇనుప స్తంభం స్థానంలో కొత్త సిమెంట్ పోల్‌ను ఏర్పాటు చేయడంతోపాటు తీగలను మార్చారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నేడు ఉమ్మడి ప్రకాశంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

ముందస్తు సమాచారంతో జాగ్రత్త పడుతున్న స్కూళ్ల యాజమాన్యం

చీరాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నేడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి పర్యటన చేయనున్నారు. ఈమేరకు సంబంధిత విద్యాశాఖ కార్యాలయాలకు ముందస్తు సమాచారం అందింది. వాస్తవానికి ఆయన బుధవారమే ఉమ్మడి ప్రకాశంలోకి ప్రవేసించాల్సి ఉండగా, బాపట్ల డివిజన్ పరిధిలోనే మధ్యాహ్నం వరకు పర్యటన సాగింది. ఈక్రమంలో గురువారానికి పర్యటన మారింది. నేటి ఆయన పర్యటన అపహాస్యంగా మారిందనడంలో సందేహం లేదు. చైర్మన్ వస్తున్నారని, మధ్యాహ్న భోజనం, రైస్ నిల్వల రికార్డులను పరిశీలిస్తారని, జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారుల నుంచి ఇప్పటికే సమాచారం చేరింది. పైగా నేడు చీరాల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్ స్కూల్, పేరాల ఏఆర్ఎం స్కూల్, ఏపీ మోడల్ స్కూల్ పర్యటన ఉంటుందని పక్కా సమాచారాన్ని జిల్లా అధికారులు స్థానిక అధికారులకు చేర వేశారు. ఈక్రమంలో ఆస్కూళ్లతో పాటు ఇతర స్కూల్స్ వారు కూడా ఎందుకొచ్చిందిలే తంటా అంటూ ఇప్పటి వరకు ఒంటికి శ్రమ ఎరుగని కొందరు రాత్రికి రాత్రే పాఠశాల పరిస్థితులపై దృష్టిసారించి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చైర్మన్ పర్యటన ముగిశాక ఎప్పటిలాగే ఇష్టారీతిగా తమ వక్ర బుద్ధి చూపుతారని అందరూ చర్చించుకుంటున్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న తెలుగునాడు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

మంత్రి సంధ్యారాణికి వినతి

అద్దంకిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర సచివాలయంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా అంగన్‌వాడీలకు కనీస వేతనాన్ని అమలు చేయాలని, సెంటర్ల నిర్వహణ భారంగా ఉన్న 4 యాప్‌లను కలిసి ఒకే యాప్ చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం వర్తింపజేయాలని, వీఆర్ఎస్ తీసుకోవడానికి అవకాశం కల్పించాలని, ఉద్యోగ విరమణ తరువాత జీతంలో కొంత భాగం పెన్షన్‌గా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అసెంబ్లీ సమావేశాలల్లో ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మీనరసమ్మ, కోశాధికారి కొడాలి హేమలత, ఉపాధ్యక్షురాలు రత్నశ్రీ, కాత్యాయని, సరిత, కోకిల, రాష్ట్ర మహిళ నాయకురాలు బొప్పన నీరజ ఉన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ

అద్దంకిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టీటీడీ కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మానవులందరికీ భగవద్గీత పుస్తకాలను హెచ్ఎం డోలా పద్మావతి, విద్వాన్ జ్యోతిచంద్రమౌళి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. భగవద్గీత చదవడం ఎంతో ఉపయోగకరమని, తప్పు చేసిన వారు ఎవరైనా వారిని విభేదించాలని, ఎదురించాలని చెప్పేదే భగవద్గీత అన్నారు. 350 మంది విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆకుచుట్టు పురుగు నివారణకు చర్యలు

పంగులూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సాగులో ఉన్న వరి పైరుకు ఆకుచుట్టు పురుగు ఆశించిందని, దాని నివారణకు రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎ.ఓ. సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరికి ఆశించిన ఆకుచుట్టు పురుగు నివారణకు క్లోర్‌పైరిఫాస్ 50 శాతం ఈసీ, సైపర్‌మెత్రిన్ 5శాతం ఈసీ కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని నివారించాలని, తెగుళ్ల నివారణకు కార్బోఫ్యూరాన్, ఫోరేట్ గుళికలను ఉపయోగించవద్దని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల వెంకటరావు, నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు సిలాషి, అక్షరణి, మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వరి పైరును పరిశీలిస్తున్న ఏవో

కత్తెర పురుగుపై అప్రమత్తం

అద్దంకిటౌన్ : మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం అద్దంకిలోని దామావారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగం గా మొక్కజొన్నను పరిశీలించారు. కత్తెర పురుగు అక్కడక్కడా పంటను నష్ట చేసిందని, దీని నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5శాతం, ఎస్‌జీ 0.5 ఎంఎల్, లేదా స్పైనోశాడ్ 45శాతం, ఎస్‌సీ 0.3 ఎంఎల్ లీటర్ నీటితో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాలడుగు శేషారావు, ఏఈవో కోటేశ్వరరావు, దామా శ్రీనివాసరావు, వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

పంట బీమాతో ప్రయోజనం

ఇంకొల్లు : పంట బీమాతో రైతులకు ప్రయోజనమని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని గంగవరంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. విత్తనశుద్ధి చేసుకొని శనగలు ఎదపెట్టుకోవాలని సూచించారు. పత్తి, మిరప సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పోటీలతో సృజనాత్మకత పెంపు

డీఈవో పురుషోత్తం

చీరాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు నిర్వహించే పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని డీఈవో ఎస్.పురుషోత్తం పేర్కొన్నారు. భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న కౌశల్ -2024 రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల పోస్టర్‌ను డీఈవో ఆవిష్కరించారు. స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో నిర్వహించినకార్యక్రమంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల 8,9,10 తరగతి విద్యార్థులకు క్విజ్, పోస్టర్, రీల్స్‌లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఏఎంవో మోజెస్, పూర్ణచంద్రరావు, మహ్మద్ సాధిక్, పవని భానుచంద్రమూర్తి, సంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అర్హ పత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

జాబ్ మేళాలో 37 మందికి ఉద్యోగాలు

చీరాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం ఎస్‌కేబీఎన్ఎం ఐటీఐ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్‌మేళాలో 37మంది ఉద్యోగాలను సాధించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 68 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, ప్రముఖ కంపెనీలైన అమర రాజా బ్యాటరీస్, రాయల్ మెరైన్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. దీంతో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ప్రతినిధులు అర్హత పత్రాలను అదించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సత్తార్, జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్, హారిక, సౌగంధి, ఎం.హారిక, వినోద్, ఇతర కళాశాలల సిబ్బంది, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

చినగంజాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పతకంలో భాగంగా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఏపీఎం జె.లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని చింతగుంపల్లి, మోటుపల్లి, మున్నంవారిపాలెం, నీలాయపాలెం గ్రామాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనుల గుర్తింపునకు, వాటి అంచనాల కోసం బుధవారం గ్రామసభలు నిర్వహించారు. కూలీలలో జాబ్ కార్డు లేని వారికి జా బ్ కార్డు అందజేస్తామని ఏపీవో తెలిపారు. గ్రామసభలలో గుర్తించిన పనులను చదివి వినించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యార్లగడ్డ సత్యనారాయణ, వడ్లమూడి సాంబశివరావు, ఆయా గ్రామాల గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీవో లక్ష్మీదేవి

నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కచ్చితంగా ప్రతి ఒక్క నిరుపేదకూ సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషి చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు గంజి పురుషోత్తం, ఆర్ఐ నాగకుమార్, అన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్, స్వర్ణరోడ్డులోని యానాది కాలనీలో డీబీఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో సు మారు 15 రకాల నిత్యవసరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధి భగవాన్‌దాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధార్, రేషన్ కార్డులను పొంది ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో వీరబాబు, సంజీవకుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, బ్రహ్మయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు